# వేకువ సమయం

సంపుటి: 14 సంచిక: 127 VEKUVA SAMAYAM TELUGU DAILY

⋆ Mahabubnagar ⋆ Hyderabad ⋆ Miryalaguda & Rangareddy సంపాదకులు : కె.భాస్కర్‌రావు రూ.2.00/- పేజీలు 8 తేది: గురువారం 28 మే 2026







## నీట్ యూజీ 2026 పేపర్ లీక్ కేసు..

**సమయం ప్రతినిధి:** నీట్ యూజీ-2026 పేపర్ లీక్ కేసులో మహారాష్ట్రకు చెందిన మరో ఇద్దరిని సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సీబీఐ) అధికారులు అరెస్టు చేశారు. నిందితుల్లో ఒకరు డాక్టర్ మనోజ్ శిరూరే కాగా.. మరొకరు ప్రముఖ కోచింగ్ సెంటర్ ఫ్యాకల్టీ తేజస్ హర్షద్ కుమార్ షాగా గుర్తించారు. దీంతో ఈ కేసులో ఇప్పటివరకు అరెస్టయిన వారి సంఖ్య 13కి చేరింది. లాతూర్‌లో వైద్యుడిగా మనోజ్ శిరూరే పని చేస్తున్నట్లు సీబీఐ అధికారులు తెలిపారు. ఓ కోచింగ్ సెంటర్ యజమాని కుమారుడితో సహా ముగ్గురు విద్యార్థులకు అతను కెమిస్ట్రీ ప్రశ్నపత్రాలు లీక్ చేయడంలో కీలకపాత్ర పోషించినట్లు ఆరోపించారు. ప్రశ్నపత్రాలను మరో నిందితుడైన పి.వి.కులకర్ణి నుంచి శిరూరే పొందినట్లు తెలిపారు. మరో నిందితుడు తేజస్ హర్షద్ కుమార్ షా.. పూణేలోని ప్రముఖ కోచింగ్ సంస్థ డాక్టర్ అభంగ్ ప్రభు మెడికల్ అకాడమీ(APMA)లో ఫిజిక్స్ ఫ్యాకల్టీగా పని చేస్తున్నట్లు పేర్కొన్నారు.



## ఈడీ రెయిడ్స్ వెనుక.. రాహుల్.!

**సమయం ప్రతినిధి:** సీఎంఆర్ఎల్ కేసులో ఈడీ తన నివాసంలో రెయిడ్స్ నిర్వహించడంపై కేరళం మాజీ సీఎం పినరయి విజయన్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈడీ సోదాల వెనుక రాహుల్ గాంధీ ఉన్నారని ఆరోపించారు. తనను అరెస్టు చేసేందుకు రాహుల్ కుట్రపన్నారని ఆరోపించారు. కాంగ్రెస్, బీజేపీ కలిసి ఈ పని చేస్తున్నాయని మండిపడ్డారు. నేడు మాజీ సీఎం పినరయి విజయన్, ఆయన కుటుంబసభ్యులకు చెందిన పలు నివాసాల్లో ఈడీ రెయిడ్స్ నిర్వహించిన విషయం తెలిసిందే. విజయన్ కూతురు వీణా విజయన్‌కు చెందిన ఐటీ సంస్థ ఎక్సాలాజిక్ సొల్యూషన్స్ నుంచి ఎలాంటి సేవలు పొందకుండానే కొచ్చిన్ మినరల్స్ అండ్ రుటైల్ లిమిటెడ్ (సీఎంఆర్ఎల్) రూ.2.7 కోట్ల నిధులు చెల్లించిందన్న ఆరోపణల నేపథ్యంలో ఈడీ ఈ సోదాలు నిర్వహించింది. మరోవైపు, ఈ సోదాలకు నిరసనగా రాష్ట్రవ్యాప్తంగా పినరయి విజయన్ మద్దతుదారులు నిరసనలకు తెరతీశారు. తిరువనంతపురంలో మాజీ సీఎం నివాసంలో సోదా నిర్వహించి వెళుతున్న ఈడీ అధికారుల వాహనాన్ని అడ్డుకున్నారు.



## ప్రధానమంత్రి మోదీని కలిసిన సీఎం విజయ్

**సమయం ప్రతినిధి:** తమిళనాడు ముఖ్యమంత్రి సి.జోసెఫ్ విజయ్ ఢిల్లీలో తొలిసారి జరుపుతున్న అధికారిక పర్యటనలో భాగంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీని సేవతీర్థ్‌లో బుధవారంనాడు కలుసుకున్నారు. ఉభయులూ 25 నిమిషాల సేపు సమావేశమయ్యారు. చోళుల కాలం నాటి రాగి శాసనాలకు పోలెండ్ నుంచి భారతదేశానికి రప్పించినందుకు మోదీకి విజయ్ కృతజ్ఞతలు తెలిపారు. కర్ణాటక ప్రకటించిన మేకేదాటు డ్యామ్ ప్రాజెక్టు, దిగువ ప్రాంతాలపై దాని ప్రభావాన్ని విజయ్ ప్రధాని దృష్టికి వెళ్లారు. ప్రభుత్వ కార్యక్రమాల్లో ముందుగా రాష్ట్ర గీతం పాడేందుకు అనుమతించాలని కూడా విజ్ఞప్తి చేశారు. అనంతరం విజయ్ నేరుగా తమిళనాడు హౌస్‌కు చేరుకోవడంతో గౌరవ వందనంతో ఆయనకు సాదర స్వాగతం లభించింది. తమిళనాడు సీఎంగా విజయ్ అధికార పగ్గాలు చేపట్టిన తర్వాత ఢిల్లీకి రావడం ఇదే ప్రథమం.

## అకాల వర్షాలతో ధాన్యం తడిసినా
# రైతులకు నష్టం లేకుండా చర్యలు



**మహబూబ్‌నగర్, సమయం ప్రతినిధి :** యాసంగి సీజన్‌లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ధాన్యం కొనుగోలు, రవాణా, మిల్లులకు తరలింపు ప్రక్రియను జిల్లా యంత్రాంగం వేగవంతంగా అమలు చేస్తోందని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా తెలిపారు. మంగళవారం రాత్రి, బుధవారం ఉదయం కురిసిన అకాల వర్షాల కారణంగా కొనుగోలు కేంద్రాల పరిధిలో సుమారు 564 మెట్రిక్ టన్నుల ధాన్యం తడిసినట్లు సమాచారం అందడంతో అధికారులు వెంటనే అప్రమత్తమయ్యారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు వ్యవసాయ, పౌర సరఫరాలు, గ్రామీణాభివృద్ధి, సహకార, రెవెన్యూ శాఖల అధికారులు కొనుగోలు కేంద్రాలను సందర్శించి పరిస్థితిని సమీక్షించారు. రైతులకు నష్టం కలగకుండా అదనపు లారీలు, ట్రాక్టర్లను ఏర్పాటు చేసి తడిసిన ధాన్యాన్ని అత్యవసరంగా సమీపంలోని పారా బాయిల్డ్ రైస్ మిల్లులకు తరలించే చర్యలు చేపట్టారు. ఇప్పటివరకు సుమారు 556 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని విజయవంతంగా మిల్లులకు తరలించినట్లు అధికారులు తెలిపారు. మిగిలిన 8 మెట్రిక్ టన్నుల ధాన్యం వద్ద భారీగా వర్షపు నీరు నిల్వ ఉండటంతో తాత్కాలికంగా తరలింపులో ఇబ్బందులు ఎదురయ్యాయని, నీటిని తొలగించిన అనంతరం ధాన్యాన్ని సంచుల్లో నింపి మిల్లులకు తరలించే ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు. భూత్పూర్ మండలం షేరిపల్లి గ్రామానికి చెందిన రైతు కె. శ్రీనివాసులు నిల్వ చేసిన వరి పూర్తిగా తడిసిపోవడంతో అధికారులు వెంటనే స్పందించి పరిశీలించారు. హస్నాపూర్ పీపీసీ పరిధిలో రైతు వరిని లోతట్టు ప్రాంతంలో ఆరబెట్టిన కారణంగా భారీ వర్షాలతో సుమారు 150 నుంచి 200 వరి సంచులు నీటిలో తడిసినట్లు గుర్తించారు. ఈ నేపథ్యంలో తాటికొండలోని నరహరి పారా బాయిల్డ్ రైస్ మిల్ యాజమాన్యంతో చర్చించి, వరిని ముందుగా అక్కడి నుంచి తరలించి సక్రమంగా సంచుల్లో నింపి మిల్లుకు తీసుకెళ్లేలా నిర్ణయం తీసుకున్నారు. రైతులకు ప్రభుత్వం అండగా నిలుస్తుందని, ధాన్యాన్ని సురక్షితంగా తరలించి కనీస మద్దతు ధర (ఎంఎస్పీ) చెల్లింపులు త్వరితగతిన అందేలా చర్యలు చేపడుతున్నట్లు అధికారులు పేర్కొన్నారు. జిల్లాలో ఇప్పటివరకు 15,046 మంది రైతుల నుంచి 83,591 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయగా, అందులో 81,681 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ఇప్పటికే రైస్ మిల్లులకు తరలించినట్లు కలెక్టర్ తెలిపారు. అలాగే 11,267 మంది రైతులకు సుమారు రూ.145 కోట్ల ఎంఎస్పీ చెల్లింపులు విడుదల చేసినట్లు వెల్లడించారు. రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా జిల్లా యంత్రాంగం కొనుగోలు, రవాణా, చెల్లింపుల ప్రక్రియలను నిరంతరం పర్యవేక్షిస్తోందని తెలిపారు.

## రిజిస్ట్రేషన్ల రద్దీ తగ్గించేందుకు ప్రత్యేక చర్యలు..



**హైదరాబాద్, (సమయం ప్రతినిధి):** రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో పెరుగుతున్న రద్దీని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. మే 29 నుంచి జూన్ 3 వరకు అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అదనపు పని వేళలు అమలు చేయనున్నట్లు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఉదయం 9:30 గంటల నుంచి రాత్రి 7:30 గంటల వరకు రిజిస్ట్రేషన్ సేవలు అందుబాటులో ఉంటాయని వెల్లడించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా స్లాట్ బుకింగ్‌ల సంఖ్యను కూడా పెంచాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అవసరమైతే మరికొన్ని రోజులు కూడా అదనపు సేవలు కొనసాగించే అవకాశం ఉందని మంత్రి తెలిపారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియలో వేగం, పారదర్శకత పెంచడంపై ప్రభుత్వం దృష్టి పెట్టిందన్నారు. అలాగే తహసీల్దార్ కార్యాలయాలతో సమన్వయం పెంచి, ప్రజలకు వేగవంతమైన సేవలు అందించాలని అధికారులను ఆదేశించారు. ప్రజల సౌకర్యమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు.



## కేంద్రం కీలక నిర్ణయం!

**సమయం ప్రతినిధి :** అత్యాధునిక ఫైటర్ జెట్స్ అభివృద్ధిలో స్వావలంబన దిశగా కేంద్ర ప్రభుత్వం చరిత్రాత్మక నిర్ణయం తీసుకుంది. అత్యాధునిక మధ్యశ్రేణి కాంబాట్ ఎయిర్ క్రాఫ్ట్ (ఏఎమ్‌సీఏ) అభివృద్ధి కోసం తొలిసారిగా ప్రైవేటు సంస్థల నుంచి ప్రతిపాదనలు కోరుతూ రిక్వెస్ట్ ఫర్ ప్రపోజల్ (ఆర్ఎఫ్‌పీ) ప్రకటనను విడుదల చేసింది. టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్, ఎల్‌అండ్‌టీ బీఈఎల్- డైనమాటిక్ కన్సార్షియంతో పాటు భారత్ ఫోర్జ్-బీఈఎమ్ఎల్-డాటా పాటర్న్ కన్సార్షియంకు ఈ 5వ తరం ఫైటర్ జెట్‌కు సంబంధించిన ప్రతిపాదనలు సమర్పించేందుకు కేంద్రం అవకాశం ఇచ్చింది. రూ.15 వేల కోట్ల విలువైన ఈ ప్రభుత్వ కాంట్రాక్ట్ దక్కించుకున్న సంస్థలకు ఏఎమ్‌సీఏకు సంబంధించి ఐదు ప్రొటోటైప్ మోడల్స్ (నమూనా), ఒక ప్రయోగాత్మక ఫైటర్‌జెట్‌ను నిర్మించే అవకాశం దక్కుతుంది. ఫైటర్ జెట్ అభివృద్ధిని వేగవంతం చేసేందుకు, స్వావలంబన సాధించేందుకు కేంద్రం ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తోంది. ఈ ప్రాజెక్టుకు నిధులను కేంద్రం పూర్తిస్థాయిలో సమకూరుస్తుంది. అయితే, ప్రాజెక్టును దక్కించుకున్న ప్రైవేటు సంస్థలు ఎయిరోనాటికల్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ (ఏడీఏ), డీఆర్‌డీఓతో కలిసి పనిచేయాల్సి ఉంటుంది.




# సంపాదకీయం

## పాలకుల నిర్దేశాలే న్యాయ నిర్ణయాలా?

'న్యాయవ్యవస్థ విశ్వసనీయత కోల్పోతే ఇక మిగిలేదేమీ ఉండదు. స్వతంత్ర న్యాయవ్యవస్థ రాజ్యాంగ జీవ లక్షణం. అది లేకపోతే.. న్యాయమూర్తులు ఉంటారు, కోర్టులు ఉంటాయి, తీర్పులు ఉంటాయి. అయితే వాటి హృదయమూ, ఆత్మ కనుమరుగైపోతాయి' అని జస్టిస్ ఉజ్జ్వల్ భుయాన్ (సుప్రీంకోర్టు న్యాయమూర్తి) అన్నారు. ఇటీవల పుణేలో వెలువరించిన ఒక స్మారకోపన్యాసంలో కేంద్ర ప్రభుత్వ అభీష్టం మేరకే ఒక హైకోర్టు న్యాయమూర్తిని బదిలీ చేస్తున్నామని కొలీజియం స్వయంగా తన మినిట్స్‌లో రికార్డు చేసిందని కూడా ఆయన వెల్లడించారు. రాజ్యాంగానికి నిబద్ధమై స్వతంత్రంగా వ్యవహరించాల్సిన న్యాయవ్యవస్థ ప్రభుత్వ ఒత్తిడికి లోనవుతూ పనిచేస్తోందని అనడానికి అది ఒక స్పష్టమైన నిదర్శనం. 'న్యాయవ్యవస్థ పార్టీ రాజకీయాలకు దూరంగా, దృఢ చిత్తంతో వ్యవహరించాలి. ప్రభుత్వంలో మార్పులకూ, న్యాయవ్యవస్థకూ ఏ మాత్రం సంబంధం ఉండకూడదు. అది అందరి పట్లా సదుద్దేశం, సానుభూతితో వ్యవహరించాలి కాని ఎవరి పక్షానా కొమ్ముకాయకూడదు' అని సుప్రీంకోర్టు ప్రారంభ సమావేశంలో తొలి భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ హరిలాల్ జె కానియా ఉద్ఘాటించారు. భారత రాజ్యాంగం అమలులోకి వచ్చి 76 సంవత్సరాలు గడిచిపోయాయి. అది ఎలా అమలువుతుందని సమీక్షించుకుంటే సర్వోన్నత న్యాయస్థానంలో ప్రమాణాలు సమున్నతమయ్యాయా లేక దిగజారిపోయాయా అన్న అనుమానాలు తలెత్తుతున్నాయి. నిజానికి మన రిపబ్లిక్ చరిత్రలో మొదటి పాతికేళ్లవరకు న్యాయవ్యవస్థ తన ఉనికిని కాపాడుకునేందుకు, ప్రజల ప్రాథమిక హక్కుల పరిరక్షణ, ప్రభుత్వ పరిధిని నిర్ణయించడంలో తన వంతు బాధ్యతను నిష్పాక్షికంగా నిర్వర్తించింది. ముఖ్యంగా అధికరణలు 14, 15, 19, 31లను సుప్రీంకోర్టు నిర్వచించింది. ప్రాథమిక హక్కులను మార్చేందుకు ఏ మాత్రం వీలు లేదని 1967లో గోలక్‌నాథ్ కేసులో స్పష్టం చేస్తే, రాజ్యాంగ మౌలిక నిర్మాణాన్ని మార్చే అధికారం పార్లమెంట్‌కు లేదని 1973లో కేశవానంద భారతి కేసులో మరింత తేటతెల్లం చేసింది. 1971లో అఖండమైన మెజారిటీతో అధికారంలోకి వచ్చిన ఇందిరాగాంధీ న్యాయవ్యవస్థతో చెలగాటమాడారు. ఆమె చర్యలకు వత్తాసు పలికిన న్యాయవ్యవస్థ పతనానికి పరాకాష్ఠ ఏడీఎం జబల్పూర్ కేసు. వేలాది రాజకీయ ప్రత్యర్థులను, జర్నలిస్టులను అరెస్టు చేసినప్పుడు ప్రజలు తమ ప్రాథమిక హక్కులను కాపాడుకునేందుకు న్యాయస్థానాలను ఆశ్రయించవచ్చా అని అడిగితే సుప్రీంకోర్టు అయిదుగురు న్యాయమూర్తుల రాజ్యాంగ ధర్మాసనం అత్యంత దుర్మార్గమైన తీర్పు వెలువరించింది. ఎమర్జెన్సీ సమయంలో ప్రజలకు ఆర్టికల్ 21 క్రింద జీవించే హక్కే లేదని ఆ ధర్మాసనంలోని నలుగురు న్యాయమూర్తులు-- ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఏఎన్ రే, జస్టిస్ పి.భగవతి, జస్టిస్ ఎంహెచ్ బేగ్, జస్టిస్ వై.వి.చంద్రచూడ్ (రెండేళ్ల క్రితం సీజేఐగా రిటైరైన డివై చంద్రచూడ్ తండ్రి)- ఏకగ్రీవంగా తీర్పునిచ్చారు. 'ఎమర్జెన్సీ పేరిట కాల్చి చంపినా అడగకూడదంటారా?' అని ఈ కేసులో నిరసన తీర్పు చెప్పిన ఏకైక న్యాయమూర్తి జస్టిస్ ఖన్నా ప్రశ్నించినప్పుడు 'మిలార్డ్, చట్టం అదే చెబుతున్నది' అని నాటి అటార్నీ జనరల్ జవాబిచ్చారట! న్యాయవ్యవస్థ చరిత్రలో చీకటి రోజులు అనదగిన ఎమర్జెన్సీ తర్వాత సుప్రీంకోర్టు ఎన్నో ఆత్మవిమర్శలు చేసుకుంది. ఎన్నో దిద్దుబాటు చర్యలను తీసుకుంది. ఎమర్జెన్సీ వైఫల్యాలనుంచి ప్రజల దృష్టి మళ్లిస్తూ రాజ్యాంగమే సుప్రీం అని ప్రకటించింది. అనేక ప్రజా ప్రయోజనాల వ్యాజ్యాలకు అవకాశం కల్పించింది. జైలులో విచారణ లేకుండా కునారిల్లుతున్న వేలాది ఖైదీలను విడుదల చేసింది. కట్టుబానిసలను విముక్తి చేసింది. న్యాయవ్యవస్థలో నియమాకాలకు కొలీజియం పద్ధతిని ప్రవేశపెట్టింది. ముఖ్యంగా ప్రజల హక్కులను, పర్యావరణాన్ని, పనిచేసే మహిళల ప్రయోజనాలను పరిరక్షించింది. రాష్ట్ర ప్రభుత్వాలను ఇష్టారాజ్యంగా గద్దె దించడాన్ని అడ్డుకున్నది. చట్టసభల్లోనే ప్రభుత్వాలు మెజారిటీని నిరూపించుకోవాలని నిర్దేశించింది. వెనుకబడిన వర్గాలు, దళితులు, ఆదివాసీల ప్రయోజనాలకు అనుకూలంగా సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పులెన్నో. ఒక దశలో న్యాయవ్యవస్థ క్రియాశీలత అబ్బురపరిచేలా కనపడింది. ఇవాళ ఎమర్జెన్సీ రోజులు లేకపోవచ్చు. కాని న్యాయవ్యవస్థపై ప్రజల విశ్వాసం సన్నగిల్లుతోందా అన్న అనుమానాలు వస్తున్నాయి. జస్టిస్ ఉజ్వల్ భుయాన్ లాంటి న్యాయమూర్తులే న్యాయవ్యవస్థ స్వతంత్రతలో ఎవరూ చొరబడకుండా చూసుకోవాల్సిన అవసరం ఉన్నదని, న్యాయమూర్తుల రాజకీయ, సైద్ధాంతిక అభిప్రాయాలు బెంచ్‌లో నిర్ణయాలను ప్రభావితం చేయకూడదని అన్నారంటే తరిచి చూసుకోవాల్సిన అవసరం ఉన్నది. న్యాయమూర్తులు బయటి నుంచి వచ్చే ఒత్తిళ్లకు ప్రభావితం కాకూడదని, తమకొచ్చే ఆదాయంతో తృప్తిగా జీవించలేని న్యాయమూర్తులను వ్యవస్థనుంచే తొలగించాలని మరో ప్రస్తుత సుప్రీం న్యాయమూర్తి జస్టిస్ బీవీ నాగరత్న అన్నారు. ఒక కళంకిత న్యాయమూర్తి వ్యవస్థకే మచ్చలాంటి వాడని ఆమె వ్యాఖ్యానించారు. 'నిష్పాక్షికత న్యాయవ్యవస్థ ఆత్మ, స్వతంత్రత న్యాయవ్యవస్థ నరాల్లో ప్రవహించే రక్తం' అని ఒడిషా హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ మురళీధరన్ అన్నారు. ఆయన ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తిగా ఉన్నప్పుడు రాజధానిలో జరిగిన అల్లర్లపై పోలీసులను నిశితంగా ప్రశ్నించారు. దీంతో రాత్రికి రాత్రే ఆయనను మరో హైకోర్టుకు బదిలీ చేశారు. అసలు న్యాయమూర్తులే న్యాయవ్యవస్థ గురించి వ్యాఖ్యానించాల్సిన అవసరం ఎందుకు వస్తోంది? సామాన్య ప్రజలకు న్యాయం చేయాల్సిన, రాజ్యాంగాన్ని పరిరక్షించాల్సిన సర్వోన్నత న్యాయస్థానం సంపన్నవర్గాలకు, ప్రభుత్వ ప్రయోజనాలకు, రాజకీయ నాయకులకు మాత్రమే అధికంగా ప్రతిస్పందిస్తోందని, పలుకుబడిగల వారికే వేగంగా తీర్పులు వస్తున్నాయని ఎందుకు విమర్శలు చెలరేగుతున్నాయి? ఒక కేసు ఫలానా బెంచి వద్దకు వెళితే ఫలానా నిర్ణయం వస్తుందని చెప్పగలిగే పరిస్థితి ఎందుకు వస్తోంది? ముఖ్యంగా గతంలో ఎన్నడూ లేని విధంగా న్యాయవ్యవస్థపై రాజకీయ ప్రభావం, దళారీల పాత్రపై అత్యధికంగా చర్చ జరుగుతోంది.

# తరుగు పేరిట రైతులను దోచుకుంటున్న వైనం

## స్పందించని పాలకులు, అధికారులు

**చివరి గింజ కొనేంతవరకు రైతుల పక్షాన పోరాడుతాము. మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి**



వనపర్తి : అలుపెరగకుండా ఉదయం నుండి రైతులను ఓదారుస్తూ మూడు మండలాలలో సుడిగాలి పర్యటన చేశారు. పెబ్బేర్ మండలంలో గుమ్మడం, పాత సుగూరు,రంగాపురం,పెబ్బేరు గ్రామాలలో పర్యటించి తడిసిన,మొలకెత్తిన ధాన్యాన్ని పరిశీలించి రైతులను ఓదార్చి అధైర్య పడొద్దు అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. సకాలములో యూరియా లేక,కరెంట్ సరఫరా లేక,రైతు భరోసా లేకున్నా ఓర్చుకొని ఆరుగాలం శ్రమించి పండించిన పంటలు కొనుగోలు లేక పడిగాపులు కాస్తూ రైతులు విలవిలాడుతున్నారని నిరంజన్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. అష్టకష్టాలు పడి ధాన్యం తరలిస్తే క్వింటాలుకు 10కిలోల తరుగు తీస్తూ రైతులను జలగల లాగ పీడిస్తున్నారని నిరంజన్ రెడ్డి దుయ్యబట్టారు. వెంటనే తడిసిన ధాన్యాన్ని మద్దతు ధరతో కొనుగోలు చేసి వారంలోపల రైతులను ప్రభుత్వం ఆదుకోకపోతే రైతుల పక్షాన పోరాడుతాము నిరంజన్ రెడ్డి హెచ్చరించారు. నిరంజన్ రెడ్డి వెంట వనం. రాములు, కర్రీస్వామి,దిలీప్ రెడ్డి,పెద్దింటి.వెంకటేష్, జగన్నాథం నాయుడు,ఎం.రాజశేఖర్,కృష్ణా రెడ్డి, ఎద్దుల సాయి కుమార్,ఎల్లారెడ్డి,గోవిందు నాయుడు మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు కార్యకర్తలు ఉన్నారు.

# కమర్షియల్ రియల్ ఎస్టేట్ లో కింగ్... మన భాగ్యనగరం

హైదరాబాద్ : ప్రపంచవ్యాప్తంగా ఇబ్బందికరమైన వాతావరణం ఉంది. కార్పొరేట్ కంపెనీలు పెట్టుబడులు పెట్టేందుకు వెనకాడుతున్నాయి. ఉన్న ఉద్యోగులను సైతం తొలగిస్తున్నాయి. సాధ్యమైనంతవరకు మెరుగైన టెక్నాలజీతో.. తక్కువ మ్యాన్ పవర్ తో పనులు చేయించుకుంటున్నాయి. దీంతో కంపెనీల పెట్టుబడులు చాలా వరకు తగ్గిపోయాయి. కార్పొరేట్ ఆఫీస్ లీజు కూడా నేల చూపులు చూస్తోంది. ఇలాంటి సమయంలో ప్రపంచానికి ఆదర్శంగా నిలుస్తోంది హైదరాబాద్.కమర్షియల్ రియల్ ఎస్టేట్లో హైదరాబాద్ కింగ్ లాగా దూసుకుపోతోంది. ముఖ్యంగా గ్లోబల్ క్యాపబిలిటీ సెంటర్లు హైదరాబాద్ నగరంలో విస్తృతంగా ఏర్పాటు అవుతున్న నేపథ్యంలో కార్యాలయాల స్థలాల లీజింగ్ విపరీతంగా పెరిగింది. ముఖ్యంగా లక్ష నుంచి పదిలక్షల విస్తీర్ణం వరకు విస్తీర్ణం ఉన్న కార్యాలయాలలో ఆయా సంస్థలు తమ పనులు మొదలుపెడుతున్నాయి. భారీ ధరకు ఒప్పందాలు చేసుకుంటున్నాయి. ప్రస్తుత ఏడాది తొలి త్రైమాసికంలో హైదరాబాద్ నగరంలో 69% అభివృద్ధి నమోదయింది. గతంలో ఇది 40 శాతం వరకు ఉండేది. గత ఏడాది ఇదే సమయానికి 26 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణానికి లీజింగ్ జరిగింది.ఈ సంవత్సరం ఈ సమయానికి 44 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణానికి అది పెరిగింది. అదే కాదు గడిచిన మూడు నెలల్లో ఏకంగా 59 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో కార్యాలయాల లావాదేవీలు జరిగాయి. ఇందులో భారీ కార్యాలయాల స్థలాల వాటా 75% గా ఉంది. ఇందులో 50 వేల చదరపు అడుగుల విస్తీర్ణం ఉన్న కార్యాలయాల వాటా 8 శాతం ఉంది. ఐదు లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఈ కంపెనీలు తమ కార్యాలయాలను ఏర్పాటు చేశాయి. మిడిల్ రేంజ్ లో కార్యాలయాల స్థలాలు 50వేల నుంచి లక్ష చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏర్పాటు చేశాయి. వీటి వాటా ఏకంగా 17 శాతం ఉంది. ఇక 10 లక్షల చదరపు అడుగుల లీజింగ్ భాగంలో కూడా ఒప్పందం కుదిరింది. దీని వాటా కూడా రెండు నుంచి మూడు శాతం వరకు ఉండే అవకాశం ఉంది.ఇటీవల ఉబర్ కంపెనీ గ్లోబల్ క్యాబబులిటీ సెంటర్ విస్తరణ కోసం హైదరాబాద్ ఐటి కారిడార్ పరిధిలోని మీనాక్షి ఎకో పార్కులో ఏకంగా 9.1 లక్షల చదరపు అడుగుల కార్యాలయాన్ని ఏర్పాటు చేసింది. జనవరిలో వీరు ని లీజుకు తీసుకుంది. దాదాపు మొత్తం 10 అంతస్తులో ఈ సంస్థ కార్యాలయాన్ని నిర్వహిస్తోంది. ప్రతి నెల దీనికి 5.86 కోట్ల అద్దె చెల్లిస్తోంది. చదరపు అడుగుకు 65 రూపాయల అద్దె చెల్లిస్తున్నట్టు సమాచారం. ప్రతి మూడు సంవత్సరాలకు 15% పెరుగుతుంది. పది సంవత్సరాలపాటు లీజు ఒప్పందం ఉంటుంది. మొత్తంగా 10 సంవత్సరాల వరకు చెల్లించే ఏకంగా 839 కోట్ల వరకు ఉంటుంది. .హైదరాబాద్ నగరంలో ఇటీవల కాలంలో జరిగిన అతిపెద్ద లీజింగ్ ఒప్పందంలో ఇది ఒకటి. హైదరాబాద్ నగరంలో స్థలాలు విస్తీర్ణంగా ఉండడం.. ఎటువంటి ఇబ్బందులు లేకుండా కార్యకలాపాలు సాగించే అవకాశం ఉండడం.. ఐటీ రంగం.. ఫార్మా రంగం అద్భుతంగా ఉండడంతో ఫైనాన్స్.. మొబిలిటీ వంటి రంగాలలో దిగ్గజాలుగా ఉన్న సంస్థలు హైదరాబాద్ నగరం వైపు దృష్టిసారిస్తున్నాయి. బెంగళూరు, ముంబై, చెన్నై వంటి పోలిస్తే హైదరాబాదులో అద్దె తక్కువగా ఉంది.

## కాంగ్రెస్, ఎస్పీ పొత్తు సాధ్యమేనా

లక్నో : యూపీలో తిరిగి అధికారాన్ని చేపట్టాలని సమాజ్ వాదీ పార్టీ ఎత్తుగడలు వేస్తోంది. వరుసగా మూడు సార్లు బీజేపీ యూపీని పాలిస్తోంది. మాయావతి సారథ్యంలోని బీఎస్పీ అంత బలంగా లేదు. దీంతో ఆ ప్లేస్ ని భర్తీ చేయాలని అఖిలేష్ యాదవ్ విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారు.2024 లో బీజేపీని నిలువరించడానికి ఏ ఫార్ములా అయితే ఫాలో అయ్యారో.. 2027 అసెంబ్లీ ఎన్నికల సమయంలోనూ అదే ఫార్ములతో వెళ్లాలని నిర్ణయించారు.కాంగ్రెస్ తో పొత్తును కొనసాగించడానికే అఖిలేష్ మొగ్గు చూపుతున్నారు. అయితే.. రెండు రోజుల క్రితమే కాంగ్రెస్ నేతలు బీఎస్పీ అధినేత్రి మాయావతి ఇంటికి వెళ్లి కలిశారు. దీంతో అఖిలేష్ అప్రమత్తమైనట్లు తెలుస్తోంది. అందుకే వెంటనే కాంగ్రెస్ తోనే వుంటానని, సీట్ల సమస్య సమస్యే కాదని, విజయమే ముఖ్యమని ఠక్కుమని చెప్పుకొచ్చారు. కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ తన పార్లమెంటరీ నియోజకవర్గమైన రాయ్‌బరేలీ నుండి 'మిషన్ 2027'కు శంఖారావం పూరించారు. సీట్ల పంపకాల చర్చల సమయంలో తమ వాదనలను బలంగా వినిపించే లక్ష్యంతో, రాష్ట్రంలో అభ్యర్థులను మరియు పోటీ చేసే స్థానాలను ఎంపిక చేసే ప్రక్రియను కాంగ్రెస్ పార్టీ ప్రారంభించింది.మరోవైపు యూపీ ఎన్నికల్లో సమాజ్ వాదీతో పొత్తు కొనసాగుతుందని కాంగ్రెస్ కూడా ప్రాథమికంగా పేర్కొంటోంది. అయితే.. సీట్ల పంపకం విసయంలోనే భిన్నాభిప్రాయాలు వున్నాయి. గతంలో రెండు సందర్భాల్లో కాంగ్రెస్, SKతో పొత్తు పెట్టుకుని ఎన్నికల్లో పోటీ చేసింది. తత్ఫలితంగా, ఒక ప్రశ్న ఉత్పన్నమవుతోంది: 2027లో SK మరియు కాంగ్రెస్ మధ్య సీట్ల పంపకానికి 2017 ఎన్నికల ఫలితాలు ప్రాతిపదికగా నిలుస్తాయా, లేక 2024లో అనుసరించిన సూత్రాన్నే ఇక్కడ కూడా వర్తింపజేస్తారా? అని ప్రశ్నలు వస్తున్నాయి.యూపీ రాజకీయాల్లో కాంగ్రెస్ ? ఎస్పీ మధ్య పొత్తు వచ్చినప్పుడల్లా సీట్ల పంపకమే ప్రస్తావనకు వస్తుంది. ఉత్తరప్రదేశ్‌లో SK-కాంగ్రెస్ కూటమి చెక్కుచెదరకుండా కొనసాగుతుందా? SKతో పొత్తు విషయంలో రాహుల్ గాంధీ మౌనం పాటిస్తున్నప్పటికీ, కాంగ్రెస్‌తో తమ కూటమి కొనసాగుతుందని అఖిలేష్ యాదవ్ మాత్రం స్పష్టంగా ప్రకటించారు.ఉత్తరప్రదేశ్‌లో, కాంగ్రెస్ మరియు SK (సమాజ్‌వాదీ పార్టీ) రెండు సందర్భాలలో కలిసి ఎన్నికల్లో పోటీ చేశాయి. మొదటిసారిగా 2017 అసెంబ్లీ ఎన్నికల సమయంలో, SK మరియు కాంగ్రెస్ ఒక కూటమిగా ఏర్పడి ఎన్నికల బరిలోకి దిగాయి; ఆ తర్వాత, 2024 లోక్‌సభ ఎన్నికలలో, ఈ రెండు పార్టీలు తమ ఎన్నికల అదృష్టాన్ని పరీక్షించుకోవడానికి మరోసారి చేతులు కలిపాయి. 2017లో, SK 311 స్థానాల్లో పోటీ చేయగా, కాంగ్రెస్ 114 స్థానాల్లో అభ్యర్థులను నిలబెట్టింది. ఈ స్థానాల్లో తొమ్మిదింటిలో, కాంగ్రెస్ మరియు SK మధ్య "స్నేహపూర్వక పోటీ" జరిగింది. ఈ సారి ఏం జరుగుతుందో చూడాలి.

## ఎండలకు మాడిపోతున్న కోళ్లు...

ఏలూరు : ఏపీలో ఎండల తీవ్రత రోజురోజుకు పెరుగుతోంది. పలు ప్రాంతాల్లో రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఎండలకుతోడు వేడిగాలులతో ప్రజలు మధ్యాహ్నం వేళ బయటకు వచ్చేందుకు భయాందోళనకు గురవుతున్నారు. మరోవైపు ఫౌల్ట్రీ ఫారాల్లో పెద్ద సంఖ్యలో కోళ్లు మృత్యువాత పడుతున్నాయి. ఉన్నట్లుండి కుప్పకూలిపోయి చనిపోతుండటంతో పౌల్ట్రీ పరిశ్రమకు తీవ్ర సంక్షోభం ఏర్పడింది.ఏపీ తూర్పుగోదావరి జిల్లా చిట్యాలలో 48.3డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఈ సీజన్లోనే అత్యధికమని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. అయితే, వచ్చే మూడు రోజుల పాటు రాష్ట్రంలో ఎండల తీవ్రత ఎక్కువగానే ఉంటుందని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్న సమయంలో బయటకు రావొద్దని హెచ్చరికలు జారీ అయ్యాయి.

## హైదరాబాద్ మెట్రోకు ఊపిరి...

హైదరాబాద్ : హైదరాబాద్ మెట్రో రైల్ ప్రాజెక్ట్ అప్పులను తీర్చడం(రీఫైనాన్స్) కోసం ఎల్ అండ్ టీ మెట్రో రైల్ హైదరాబాద్ లిమిటెడ్ సంస్థకు.. ఇండియన్ రైల్వే ఫైనాన్స్ కార్పొరేషన్ రూ.13,527 కోట్ల భారీ రుణాన్ని మంజూరు చేసింది. ఈ డీల్ వార్త బయటకు రాగానే షేర్ మార్కెట్‌లో ఐఆర్‌ఎఫ్‌సీ షేర్లు 4 శాతం పెరిగి రూ.102 కి చేరుకున్నాయి.మెట్రో ప్రాజెక్ట్ కోసం గతంలో ఎక్కువ వడ్డీకి తీసుకున్న పాత అప్పులను తీర్చేసి.. వాటి స్థానంలో తక్కువ వడ్డీకి, ఎక్కువ కాలపరిమితితో కొత్త అప్పును తీసుకోవడాన్నే 'రీఫైనాన్సింగ్' అంటారు. ఈ రూ13,527 కోట్ల రుణాన్ని 20 ఏళ్ల పాటు ప్రతి మూడు నెలలకొకసారి ఈఎంఐ (త్రైమాసిక వాయిదాలు) రూపంలో మెట్రో సంస్థ చెల్లిస్తుంది.ఈ అప్పు తీసుకోవడానికి ఎలాంటి ప్రాసెసింగ్ ఫీజు గానీ, ముందే అప్పు తీర్చేస్తే వేసే పెనాల్టీలు గానీ లేవు. దీనివల్ల మెట్రో ప్రాజెక్టుపై ఆర్థిక భారం చాలా వరకు తగ్గుతుంది.హైదరాబాద్ మెట్రో ప్రస్తుత పరిస్థితి చూసుకుంటే.. హైదరాబాద్ మెట్రో ఫేజ్-1 ప్రాజెక్టులో 3 కారిడార్లలో 57 స్టేషన్లతో మొత్తం 69.2 కిలోమీటర్ల మేర విస్తరించి ఉంది. ప్రభుత్వ-ప్రైవేట్ భాగస్వామ్యం మోడల్‌లో ప్రపంచంలోనే నిర్మించిన అతిపెద్ద మెట్రో ప్రాజెక్టులలో ఇది ఒకటి. ప్రస్తుతం రోజూ 5 లక్షల మందికి పైగా ప్రయాణికులు మెట్రోలో ప్రయాణిస్తున్నారు.ఈ ఆర్థిక ఊరట వల్ల తెలంగాణ ప్రభుత్వం తదుపరి మెట్రో విస్తరణ పనులను (కొత్త రూట్లు, లాస్ట్ మైల్ కనెక్టివిటీ) మరింత వేగవంతం చేసే అవకాశం ఉంటుందిసాధారణంగా ఎఖీఈఅ సంస్థ కేవలం రైల్వే రంగానికి (రైళ్లు, పట్టాల నిర్మాణం) మాత్రమే నిధులు సమకూరుస్తుంది. కానీ ఇప్పుడు మొదటిసారిగా మెట్రో లాంటి పబ్లిక్ యుటిలిటీ (ప్రజా రవాణా) మౌలిక సదుపాయాలకు కూడా అప్పులు ఇవ్వడం ప్రారంభించింది. తమ వ్యాపారాన్ని ఇతర రంగాలకు విస్తరించడంలో ఇదొక పెద్ద అడుగు అని కంపెనీ పేర్కొంది.జూలై 2024 లో ఈ షేర్ ధర అత్యధికంగా రూ.229 కి చేరింది. ఆ తర్వాత కాలంలో ఈ షేర్ భారీగా పతనమై దాదాపు 56 శాతం విలువను కోల్పోయింది.

# ఆడబిడ్డల, రైతుల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం : ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే





**మహబూబ్‌నగర్, (సమయం ప్రతినిధి):** కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి దాదాపు రెండు సంవత్సరాలు పూర్తయ్యాయని, ఈ కాలంలో ప్రజా సంక్షేమానికి విశేష ప్రాధాన్యతనిస్తూ అనేక పథకాలను విజయవంతంగా అమలు చేస్తున్నామని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి లి తెలిపారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మహబూబ్ నగర్ పట్టణానికి చెందిన 160 మంది లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి చెక్కులను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తన నియోజకవర్గంలో ఇప్పటివరకు సుమారు 2,500 మంది లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి చెక్కులు అందజేసే అవకాశం లభించిందని, గతంలో ఎప్పుడూ ఇంత పెద్ద సంఖ్యలో చెక్కులు ఇవ్వలేదని చెప్పారు. రాబోయే రోజుల్లో మరింత మంది అర్హులైన వారికి ఈ పథకం అందేలా కృషి చేస్తామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆడబిడ్డల సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని, వారి విద్య, ఉపాధి, స్వయం సమృద్ధి కోసం పలు కార్యక్రమాలు చేపడుతున్నామని అన్నారు. స్కూల్స్, కాలేజీల్లో మెరుగైన వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. మహిళల కోసం ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడం ద్వారా వారు విద్య, ఉపాధి, వ్యాపారం వంటి రంగాల్లో ముందుకు సాగేందుకు ప్రోత్సాహం లభిస్తోందని చెప్పారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద తెలంగాణ రాష్ట్రంలో ఇప్పటివరకు సుమారు 4.5 లక్షల ఇళ్లు నిర్మించామని, వచ్చే సంవత్సరం జూన్ 2 నుండి 2 లక్షల ఇందిరమ్మ ఇళ్లు అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఆయన వెల్లడించారు. రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం కట్టుబడి ఉందని, సుమారు 25 లక్షల రైతు కుటుంబాలు అప్పుల భారం నుంచి విముక్తి పొందాయని తెలిపారు. గతంలో రైతులు ఎదుర్కొన్న సమస్యలను అధిగమించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందని చెప్పారు. కేసిఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో రైతులు అప్పుల బాధతో ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితులు ఉండేదన్నారు. మా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రైతులకు అండగా నిలిచిందని పేర్కొన్నారు. ప్రతి వర్గం ప్రజల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని, మహిళలు, రైతులు, విద్యార్థులు అందరూ అభివృద్ధి చెందేలా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. మహిళలను ఆర్థికంగా బలపరచి, స్వయం సమృద్ధి సాధించేలా చేయడం మా ముఖ్య లక్ష్యమని పేర్కొన్నారు. మహిళల ఆశీర్వాదం, ప్రజల మద్దతు తమ ముఖ్యమంత్రి కి, కాంగ్రెస్ ప్రభుత్వానికి ఎల్లప్పుడూ ఉంటుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ శ్రీమతి గుమ్మాల మమత శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ మారే పల్లి సురేందర్ రెడ్డి, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ బెక్కెరి అనిత మధుసూదన్ రెడ్డి, కార్పొరేటర్లు భాను చందర్, కిషన్ నాయక్, అనుప ఆంజనేయులు, తాహేర్, ఫయాజ్, శేఖర్, యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి సంజీవరెడ్డి, నాయకులు రాములు యాదవ్, టంకర కృష్ణయ్య యాదవ్, లీడర్ రఘు, జాజి మొగ్గ నర్సింహులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## దేవరకొండలో ఎన్టీఆర్ జయంతి వేడుకలు



దేవరకొండ: తెలుగుదేశం వ్యవస్థాపకులు నందమూరి ఎన్టీ రామారావు జయంతి సందర్భంగా దేవరకొండ నియోజకవర్గం ఇన్చార్జ్ వస్కుల కృష్ణయ్య. తెలుగుదేశం పార్టీ జెండా ఆవిష్కరించడం జరిగింది. వస్తువుల కృష్ణయ్య మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు నందమూరి తారక రామారావు జయంతి వేడుకలను మహానాడు వేదికగా ప్రతి సంవత్సరం మే 27, 28, 29 తేదీలలో ఘనంగా నిర్వహించుకోవడం జరుగుతుందని తెలిపారు. ఎప్పటిలాగే ఈసారి కూడా జన్మదిన వేడుకలను నిర్వహించుకోవడానికి కొన్ని కారణాల దృష్ట్యా ఘనంగా నిర్వహించలేక వర్చువల్ కార్యక్రమాల ద్వారా నిర్వహించుకుంటున్నామని, దానిలో భాగంగా బుధవారం దేవరకొండ లో పార్టీ జెండా ఆవిష్కరణ చేసి పార్టీ సంబరాలు నిర్వహించుకోవడం జరిగిందని, రేపు ఎన్టీఆర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించుకోవడం జరుగుతుందని తెలిపారు.నందమూరి తారరామారావు . తెలుగుదేశం పార్టీని ఏ ఆశయంతో స్థాపించారో, ఆ ఆశయాలను ముందుకు తీసుకెళ్లడానికి ప్రస్తుత జాతీయ పార్టీ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు నిరంతరం కృషి చేస్తున్నారని, తెలుగుదేశం పార్టీని తెలుగు ప్రజలే కాకుండా ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగు ప్రజలందరూ గర్వించదగ్గ విధంగా నడిపిస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు, బ్రహ్మాచారి. రమేష్. నేరడుగోమ్ము. సీనియర్ నాయకులు. బోడదనయ్య యాదవ్. గుడిపల్లి సీనియర్ నాయకులు. ఆలేటి నరసింహ. పీఏ పల్లి సీనియర్ నాయకులు. సీతారాములు. దేవరకొండ సీనియర్ నాయకులు. శ్రీను. చందంపేట సీనియర్ నాయకులు. శ్రీను. వస్కుల రాజేష్. కార్యకర్తలు పాల్గొన్నారు.

## ముస్లిం సోదరులకు బక్రీద్ పర్వదిన శుభాకాంక్షలు

**శాంతియుత వాతావరణంలో బక్రీద్ వేడుకలు నిర్వహించుకోవాలని సూచన**
**సామాజిక ఐక్యతను మరింత బలోపేతం చేసే పవిత్ర పర్వదినం బక్రీద్**
**ప్రజల భద్రత కోసం పోలీసు శాఖ ప్రత్యేక ఏర్పాట్లు**




వనపర్తి : త్యాగం, సహనం, సోదరభావానికి ప్రతీకైన బక్రీద్ పండుగను ఆనందోత్సాహాలతో జరుపుకోవాలి వనపర్తి జిల్లా ప్రజలకు, ముఖ్యంగా ముస్లిం సోదర సోదరీమణులకు జిల్లా ఎస్పీ శ్రీమతి లిసునిత రెడ్డి, బక్రీద్ పర్వదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ గారు మాట్లాడుతూ.. బక్రీద్ పండుగ త్యాగం, ప్రేమ, దయ, సోదరభావం వంటి గొప్ప మానవీయ విలువలను చాటిచెప్పే పవిత్రమైన పర్వదినమని అన్నారు. ప్రతి ఒక్కరూ ఈ పండుగను కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో కలిసి సుఖసంతోషాలతో, ఆనందంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. జిల్లాలో బక్రీద్ వేడుకలు శాంతి యుత వాతావరణంలో, పరస్పర గౌరవభావంతో నిర్వహించుకోవాలని సూచించారు. సామాజిక ఐక్యతను కాపాడుతూ, పరస్పర సహకారంతో పండుగను విజయవంతంగా జరుపుకోవాలని కోరారు. పండుగ సందర్భంగా ప్రజల భద్రత కోసం జిల్లా పోలీసు శాఖ ప్రత్యేక భద్రతా ఏర్పాట్లు చేపట్టినట్లు తెలిపారు. ఎటువంటి అనుమానాస్పద ఘటనలు గమనించిన వెంటనే సమీప పోలీసు అధికారులకు సమాచారం అందించాలని సూచించారు.


## అప్పుల బాధతో కౌలు రైతు చనిపోవడం బాధాకరం...





**(సమయం ప్రతినిధి దేవరకద్ర) :** ఒకే కుటుంబానికి చెందిన నలుగురు చనిపోయిన ఘటనపై మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. నర్సింహులు కుటుంబం మొత్తం ప్రాణాలు కోల్పోవడం పట్ల దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే సంతాపం తెలియజేశారు. దేవరకద్ర మండలం డోకూర్ గ్రామానికి చెందిన కౌలు రైతు నర్సింహులు అప్పుల బాధతో తన ఇద్దరు పిల్లలు,భార్యతో సహా ఆత్మహత్య చేసుకున్న ఘటనపై మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. దేవరకద్ర నియోజకవర్గానికి చెందిన రైతు అప్పుల బాధతో చనిపోయిన వార్త తెలియగానే తీవ్ర ఆవేదనకు లోనయ్యారు.తమ నియోజకవర్గానికి చెందిన రైతు ఈ విధంగా ఆత్మహత్య చేసుకోవడం ఎంతగానో కలిచివేసిందన్నారు.జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ హాస్పిటల్ మార్చురీ వద్ద బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి,వారికి ధైర్యం చెప్పారు. చనిపోయిన వారి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థించారు.మృతుల కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

# పని ప్రదేశాల్లో మహిళల భద్రతకు POSH చట్టం దోహదం






**అవగాహన కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ డా. కిరణ్మయి**

రంగారెడ్డి, సమయం ప్రతినిధి : పని ప్రదేశాల్లో మహిళలపై లైంగిక వేధింపులను నిరోధించేందుకు అమల్లో ఉన్న పోష్ (POSH) చట్టం మహిళల భద్రతకు కీలకమని జిల్లా అడిషనల్ కలెక్టర్ డా. కిరణ్మయిఅన్నారు. మహిళా శిశు వికలాంగుల, వయోవృద్ధుల శాఖ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. మహిళలు ఉద్యోగ ప్రదేశాల్లో వేధింపులకు గురైతే POSH చట్టం ద్వారా న్యాయం పొందే అవకాశం ఉందని, ప్రతి మహిళ తమ హక్కులపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. మహిళలకు భద్రత కల్పించడంలో ఈ చట్టం ముఖ్యపాత్ర పోషిస్తోందన్నారు. కార్యక్రమంలో డీఆర్డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ శారద దేవి, వ్యవసాయ శాఖ అధికారులు, ఎస్సీ కార్పొరేషన్, అడల్ట్ ఎడ్యుకేషన్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు. స్పీకర్ పద్మజ ఎన్.జి. మాట్లాడుతూ POSH చట్టం ఆవిర్భావం, విశాఖ మార్గదర్శకాల ప్రాముఖ్యతను వివరించారు. మహిళలు పని ప్రదేశాల్లో వేధింపులకు గురైనప్పుడు తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. లోక్ అదాలత్ పర్మనెంట్ మెంబర్ అమృత రాజా మాట్లాడుతూ మహిళలు భద్రతగా పనిచేసే వాతావరణం కల్పించడంలో POSH చట్టం కీలక పాత్ర పోషిస్తోందన్నారు. డా. సింధు ప్రీతి మాట్లాడుతూ ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల్లో తప్పనిసరిగా ఇంటర్నల్ కమిటీలు ఏర్పాటు చేయాలని సూచించారు. హైకోర్టు అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ యాదగిరి మహిళలకు అందుబాటులో ఉన్న న్యాయ పరిరక్షణలు, గృహహింస చట్టం కింద నమోదయ్యే కేసులపై వివరించారు. రంగారెడ్డి జిల్లాలో మహిళా ఉద్యోగులు, యువతులకు చట్టంపై అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమం నిర్వహించినట్లు అధికారులు తెలిపారు.

# రైతు ప్రయోజనాలే లక్ష్యం
# ధాన్యం తరలింపులో నిర్లక్ష్యం చేస్తే చర్యలు






## అధికారులు,మిల్లర్ల సమన్వయంతోనే ధాన్యం కొనుగోళ్లు సజావు జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్

**నాగర్ కర్నూల్ ప్రతినిధి:** నాగర్ కర్నూల్ జిల్లాలో కొనసాగుతున్న వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను మరింత వేగవంతంగా, పారదర్శకంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ సంబంధిత శాఖల అధికారులకు, రైస్ మిల్లర్లకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. బుధవారం జిల్లా కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో సివిల్ సప్లై, వ్యవసాయ, రవాణా, రెవిన్యూ శాఖల అధికారులు, రైస్ మిల్లర్లతో కలిసి జిల్లాలోని కొనుగోలు పరిస్థితులను ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ...... రైతులు ఎంతో శ్రమించి పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకు వస్తున్నందున, ఎలాంటి జాప్యం లేకుండా కొనుగోలు ప్రక్రియ పూర్తి చేయాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. రైతులు ధాన్యం తీసుకొచ్చిన వెంటనే తూకం, హమాలీ, లోడింగ్, రవాణా వంటి అన్ని ప్రక్రియలను వేగంగా పూర్తి చేయాలని సూచించారు. అలాగే ధాన్యం కొనుగోలు సమయంలో "తాలు తరుగు" పేరుతో రైతులకు అన్యాయం జరగకూడదని స్పష్టం చేశారు. ప్రభుత్వం నిర్దేశించిన ప్రమాణాల ప్రకారమే తేమ శాతం, నాణ్యత అంచనా వేయాలని, అదనపు కోతలు విధించడం లేదా రైతులను అనవసరంగా ఇబ్బందులకు గురి చేయడం సహించబోమన్నారు. ఇటీవల జిల్లాలోని కొన్ని కొనుగోలు కేంద్రాలపై వచ్చిన ఫిర్యాదులను పరిశీలించిన అనంతరం ఈ ఆదేశాలు జారీ చేసినట్లు కలెక్టర్ తెలిపారు. రైతుల నుంచి ఎటువంటి ఫిర్యాదులు రాకుండా పారదర్శకంగా కొనుగోళ్లు నిర్వహించాలని, అధికారులు నిరంతరం పర్యవేక్షణ కొనసాగించాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం నిల్వలు పేరుకుపోకుండా సమయానికి లారీలను ఏర్పాటు చేసి ధాన్యాన్ని తరలించాలని సూచించారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని మిల్లులకు తరలించే విషయంలో నిర్లక్ష్యం ప్రదర్శిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. రైతులు కేంద్రాల వద్ద ఎక్కువసేపు వేచి ఉండకుండా అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. జిల్లాలో కురుస్తున్న అకాల వర్షాల నేపథ్యంలో ధాన్యం తడవకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సూచించిన కలెక్టర్, కొనుగోలు కేంద్రాల్లో టార్పాలిన్లు, తాగునీరు, విద్యుత్, కూర్చునే సదుపాయాలు వంటి మౌలిక వసతులు తప్పనిసరిగా అందుబాటులో ఉండాలని తెలిపారు. ధాన్యం నాణ్యత ప్రమాణాలను పాటిస్తూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని, జిల్లాలోని అన్ని కొనుగోలు కేంద్రాల్లో అధికారులు, మిల్లర్లు పరస్పర సమన్వయంతో పనిచేస్తేనే కొనుగోలు ప్రక్రియ సజావుగా సాగుతుందని కలెక్టర్ అభిప్రాయపడ్డారు. రైతులకు ఇబ్బందులు కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ అమరేందర్‌తో పాటు సివిల్ సప్లై, వ్యవసాయ, రవాణా, రెవిన్యూ శాఖల అధికారులు, రైస్ మిల్లర్ల ప్రతినిధులు పాల్గొన్నారు.

## "పూర్వ ఎమ్మెల్సీ, ప్రొఫెసర్ కె.నాగేశ్వర్ పై కేసులను ఉపసంహరించుకోవాలి

**మీడియా స్వేచ్ఛను కాపాడాలి**

**టిఎస్ యుటిఎఫ్**

**నాగర్ కర్నూల్ ప్రతినిధి :** ప్రముఖ సామాజిక రాజకీయ మరియు మీడియా విశ్లేషకుడు, విశ్రాంత జర్నలిజమ్ ఆచార్యులు ప్రొఫెసర్ కె.నాగేశ్వర్ పై ఆంధ్రప్రదేశ్ లోని వివిధ పోలీసు స్టేషన్లలో బనాయించిన కేసులను తక్షణమే ఉపసంహరిం చుకోవాలని, తదుపరి చర్యలు విరమించుకోవాలని టిఎస్ యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆర్.కృష్ణ, డాక్టర్ యం శ్రీధర్ శర్మ డిమాండ్ చేశారు. ఆచార్య నాగేశ్వర్ జర్నలిజం అధ్యాపకునిగా దీర్ఘకాలం ఉస్మానియా యూనివర్సిటీలో విద్యార్థులకు పాఠాలు బోధించడంతో పాటు, సివిల్ సర్వెంట్స్ మొదలు రాజకీయ నాయకుల వరకు వివిధ అంశాలపై శిక్షణనిస్తూ పాలకులు ఎవరైనా నిక్కచ్చిగా, సామా జిక కోణంలో తన అభిప్రాయాలను వెల్లడిస్తున్నారు. గత మరియు ప్రస్తుత ముఖ్య మంత్రులతో సహా రాష్ట్రంలోని దాదాపు అన్ని రాజకీయ పార్టీలు ఏదో ఒక సందర్భంలో ఆయన సలహాలు సూచనలు తీసుకున్నవారే. ఒక టివి ఛానల్ ఇంటర్వ్యూలో నాగేశ్వర్ చేసిన వ్యాఖ్యలు అసభ్యంగానో లేదా వ్యక్తిగత విమర్శలో కావని వారి వ్యాఖ్యలతో విభేదించే వారు ప్రజాస్వామ్యయుతంగా ఖండించవచ్చని వారు అన్నారు. ప్రొఫెసర్ నాగేశ్వర్ తన వ్యాఖ్యలపై అభ్యంతరాలు వ్యక్తమైన వెంటనే వాటిని వెనక్కి తీసుకుంటు న్నట్లు ప్రకటించారని అయినా ఆయనపై కేసులు పెట్టి అరెస్టు చేయాలని ప్రయత్నిం చడం అప్రజాస్వామికం అనీ ఈ చర్య మీడియా స్వేచ్ఛపై దాడిగానే భావించాల్సి ఉంటుందని వారు అన్నారు.ఈ సంఘటనపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు జోక్యం చేసుకొని కేసులను ఎత్తివేసి ఈ వివాదాన్ని ఇంతటితో ముగించాలని వారు కోరారు.ప్రకటన విడుదల చేసిన వారిలో ఎఫ్ డబ్ల్యూఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎ.చిన్నయ్య, రాష్ట్ర కమిటీ సభ్యులు కొర్ర శంకర్, ఎం రమాదేవి, ఆర్ లలితాబాయి ఉపాధ్యక్షుడు సి. తిరుపతయ్య జిల్లా కోశాధికారి జె.బాల్ రాజ్ మరియు జిల్లా కార్యదర్శులు రాష్ట్ర కౌన్సిలర్స్ ఉన్నారు.

## ముస్లిం సోదరసోదరీమణులకు బక్రీద్ పండుగ శుభాకాంక్షలు



**దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్**

దేవరకొండ: భక్తికి, త్యాగానికి, సహనానికి బక్రీద్ పండుగ ప్రతీక అని దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ పేర్కొన్నారు. బక్రీద్ పండుగ సందర్భంగా ముస్లిం సోదరసోదరీమణులకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు. భక్తి, శ్రద్ధలతో ప్రశాంత వాతావరణంలో బక్రీద్ పండుగను జరుపుకోవాలని సూచించారు. దైవ ప్రవక్త ఇబ్రహీం మహోన్నత త్యాగాన్ని స్మరించుకుంటూ ముస్లింలు బక్రీద్ పండుగను జరుపుకుంటారని అన్నారు. పేదల పట్ల జాలి, దయ కలిగి ఉండటమే బక్రీద్ ఇచ్చే సందేశమన్నారు. అల్లాహ్ ఆశీస్సులు ప్రజలందరికీ ఎల్లప్పుడూ ఉండాలని ఆయన ఆకాంక్షించారు.

## గట్టుకాడిపల్లి ఆలయాన్ని సందర్శించి స్వామివారిని దర్శించుకున్న మాజీ మంత్రి





**వనపర్తి :** ఖిల్లా ఘనపూర్ మండలంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన గట్టుకాడిపల్లి ఆలయాన్ని మాజీ మంత్రివర్యులు సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి సందర్శించి స్వామి వారిని భక్తిశ్రద్ధలతో దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు వేదమంత్రోచ్చారణల మధ్య మాజీ మంత్రి కి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి ప్రత్యేక పూజల్లో పాల్గొని రాష్ట్ర ప్రజలు సుఖశాంతులతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రార్థించారు. రైతులు, యువత, మహిళలు అన్ని వర్గాల ప్రజలు సంతోషంగా ఉండాలని స్వామివారిని వేడుకున్నారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు మాజీ మంత్రికి ఘన స్వాగతం పలికి శాలువాతో సన్మానించారు. గ్రామ దేవాలయాలు, ఆధ్యాత్మిక కేంద్రాలు సమాజానికి ఐక్యతను, సంస్కృతిని కాపాడే శక్తికేంద్రాలని మాజీ మంత్రి పేర్కొన్నారు. మాజీ మంత్రి వెంట నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ నాయకులు, కార్యకర్తలు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## గద్వాల్ జిల్లాలో ఫుడ్ సేఫ్టీ అధికారుల జాడేది...



జోగులాంబ గద్వాల జిల్లా : ఐజ మున్సిపాలిటీలో ఫుడ్ పాయిజన్ ఘటన కలకలం రేపింది. పట్టణంలోని పాత బస్టాండ్ వద్ద పానీపూరి తిన్న 15 మంది చిన్నారులు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. వాంతులు, విరేచనాలతో బాధపడుతున్న బాధితులు పట్టణంలోని పలు ప్రైవేట్,ప్రభుత్వ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. పానీపూరి తినడం వల్లే ఫుడ్ పాయిజన్ అయింది.అని స్థానిక ప్రజలు, బాధితుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. కల్తీ నీళ్ళు, నాణ్యతలేని పదార్థాలు వాడడం వల్లే ఈపరిస్థితి వచ్చిందని మండిపడుతున్నారు. ఫుడ్ సేఫ్టీ అధికారులు ఉంటారని సినిమాల్లో చూశాం. వాస్తవ జీవితంలో ఈ అధికారులు ఉండి,తనిఖీలు చేసి ఉంటే ఈరోజు ఈ పిల్లలకు




ఈ పరిస్థితి వచ్చేది కాదేమో.అని బాధితుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలోఫుడ్ సేఫ్టీ అధికారుల పనితీరుపై ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

## డిగ్రీ స్టూడెంట్స్ కు అదిరిపోయే న్యూస్ ఫైనలియర్ స్టైఫండ్

హైదరాబాద్ : రాష్ట్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో 2026-27 విద్యాసంవత్సరానికి గాను 11 కొత్త అప్రెంటిస్‌షిప్ ఎంబెడెడ్ డిగ్రీ ప్రోగ్రామ్స్ కోర్సులను ప్రవేశపెట్టినట్లు కళాశాల విద్యాశాఖ కమిషనర్ శ్రీదేవసేన తెలిపారు. ఈ మూడేళ్ల కోర్సుల్లో చివరి ఏడాది విద్యార్థులు వివిధ కంపెనీల్లో ప్రాక్టికల్ శిక్షణ పొందుతూ నెలకు రూ.7 వేల స్టైపెండ్ అందుకుంటారు. ఈ ఏడాది మొత్తం సీట్లను 11 వేలకు పెంచగా.. కనీసం 8 వేల సీట్లను భర్తీ చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నారు. జూన్ 12న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమక్షంలో ప్రముఖ పరిశ్రమలతో ఈ మేరకు అవగాహన ఒప్పందాలు జరగనున్నాయి.రాష్ట్రంలో డిగ్రీ పూర్తి చేసిన ప్రతి విద్యార్థికి కచ్చితంగా ఉపాధి లభించాలనే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు ఉన్నత విద్యాశాఖ కీలక అడుగులు వేసింది. విద్యార్థులకు సంప్రదాయ విద్యతో పాటు పరిశ్రమల అవసరాలకు తగ్గట్లుగా ఉద్యోగ శిక్షణ ఇచ్చేందుకు అప్రెంటిస్‌షిప్ ఎంబెడెడ్ డిగ్రీ ప్రోగ్రామ్స్ కింద కొత్తగా 11 కోర్సులను ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో రాబోయే విద్యాసంవత్సరం (2026-27) నుంచి అందుబాటులోకి తెచ్చారు. ఐఐటీ హైదరాబాద్ డైరెక్టర్ ఆచార్య బీఎస్ మూర్తి, సీఐఐ విద్యా సలహాదారు శేఖర్‌రెడ్డిలతో కలిసి కళాశాల విద్యాశాఖ కమిషనర్ శ్రీదేవసేన వెల్లడించారు.ఈ మూడేళ్ల కాలపరిమితి గల డిగ్రీ కోర్సుల్లో చేరే విద్యార్థులు తమ చివరి సంవత్సరం అంతా క్షేత్రస్థాయిలో వివిధ పరిశ్రమలు, కార్పొరేట్ కంపెనీలు, లేదా ప్రభుత్వ అనుబంధ సంస్థల్లో ప్రత్యక్షంగా శిక్షణ పొందాల్సి ఉంటుంది. ఆ అప్రెంటిస్‌షిప్ సమయంలో విద్యార్థులకు ఆర్థిక భరోసాగా నెలకు రూ.7 వేల చొప్పున స్టైపెండ్ కూడా చెల్లిస్తారు. ఈ వినూత్న కోర్సుల ద్వారా అప్రెంటిస్‌షిప్ విజయవంతంగా పూర్తి చేసుకున్న అభ్యర్థులలో దాదాపు 80 నుండి 90 శాతం మందికి వారు శిక్షణ పొందిన సంస్థల్లోనే శాశ్వత ఉద్యోగాలు కల్పించడమే ప్రధాన లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోంది. ఇందులో భాగంగా.. విద్యార్థులకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు జూన్ 12న సీఎం రేవంత్ రెడ్డి సమక్షంలో పలు ప్రముఖ కంపెనీలు, పారిశ్రామిక సంస్థలతో ఉన్నత విద్యాశాఖ అధికారికంగా అవగాహన ఒప్పందాలు కుదుర్చుకోనుంది.విద్యార్థులు డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్ తెలంగాణ నోటిఫికేషన్ ద్వారా ఈ ఏఈడీపీ కోర్సుల్లో ప్రవేశాలు పొందవచ్చు. గత విద్యాసంవత్సరంలో 16 రకాల కోర్సులకు గాను 6 వేల సీట్లు అందుబాటులో ఉండగా కేవలం 1,770 మంది మాత్రమే చేరారు. అయితే ఈసారి ఉపాధి అవకాశాలు ఎక్కువగా ఉండే కోర్సులను చేర్చడంతో పాటు మరో 5 వేల సీట్లను అదనంగా పెంచారు. దీంతో మొత్తం సీట్ల సంఖ్య 11 వేలకి చేరగా.. ఈ విద్యాసంవత్సరంలో కనీసం 8 వేల సీట్లను భర్తీ చేయాలని విద్యాశాఖ లక్ష్యంగా నిర్దేశించుకుంది.రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 94 ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో మొత్తం 27 రకాల ఏఈడీపీ కోర్సులు అందుబాటులో ఉంటాయని కమిషనర్ స్పష్టం చేశారు.

# ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య సేవలపై కలెక్టర్ ఆరా

**వైద్య సేవల్లో నిర్లక్ష్యం సహించం**
**పీహెచ్‌సీల్లో పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలి**
**జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్**

నాగర్ కర్నూల్ ప్రతినిధి: నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట నియోజకవర్గం పరిధిలోని బల్మూర్ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ బుధవారం ఉదయం ఆకస్మికంగా సందర్శించి పరిశీలించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రజలకు అందుతున్న వైద్య సేవలు, సిబ్బంది పనితీరు, అందుబాటులో ఉన్న సౌకర్యాలపై వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆసుపత్రి ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఏఎన్ఎం కిట్‌ను కలెక్టర్ ప్రత్యేకంగా పరిశీలించారు. కిట్‌లో ఉన్న వైద్య పరికరాలు, మందులు, అత్యవసర సేవలకు ఉపయోగించే సామగ్రి గురించి సంబంధిత వైద్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు.ఏఎన్ఎం కిట్టులో పాము కాటు, కుక్క వ్యాక్సిన్ లు, పిల్లలకు అందించే వ్యాక్సిన్లు ఉన్నాయా లేదా అని కలెక్టర్ ఆరా తీశారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు అవసరమైన అన్ని పరికరాలు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని వైద్య ఆరోగ్య శాఖ అధికారులకు సూచించారు. అనంతరం ఆసుపత్రికి చికిత్స కోసం వచ్చిన రోగులతో కలెక్టర్ నేరుగా మాట్లాడి వారికి అందుతున్న వైద్య సేవలపై అభిప్రాయాలు తెలుసుకున్నారు. వైద్యులు, సిబ్బంది సమయానికి అందుబాటులో ఉంటున్నారా, మందులు సరిపడా ఉన్నాయా, రోగులకు ఎలాంటి ఇబ్బందులు ఎదురవుతున్నాయా అనే అంశాలపై ఆరా తీశారు. ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడంలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని వైద్య అధికారులను హెచ్చరించారు. అలాగే ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పరిశుభ్రతను కచ్చితంగా పాటించాలని, ఆసుపత్రి పరిసరాలను ఎల్లప్పుడూ శుభ్రంగా ఉంచాలని సూచించారు. గర్భిణీలు, చిన్నారులకు అందించే వైద్య సేవలపై ప్రత్యేక దృష్టి సారించాలని, గ్రామీణ ప్రాంత ప్రజలకు ప్రభుత్వ వైద్య సేవలు సకాలంలో అందేలా అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ తనిఖీ సందర్భంగా కలెక్టర్ వెంట అచ్చంపేట ఆర్డీవో యాదగిరి, తహసీల్దార్ శ్రీనివాస్, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, స్థానిక వైద్య సిబ్బంది, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.




# బక్రీద్ నేపథ్యంలో గోవుల అక్రమ రవాణాపై పోలీసుల కట్టుదిట్టమైన నిఘా






**కోయిలకొండ ఎక్స్‌రోడ్ చెక్‌పోస్ట్‌ను తనిఖీ చేసిన వన్‌టౌన్ ఇన్స్పెక్టర్ అప్పయ్య**

మహబూబ్‌నగర్, సమయం ప్రతినిధి : బక్రీద్ పండుగ సందర్భంగా గోవుల అక్రమ రవాణాను అరికట్టేందుకు మహబూబ్‌నగర్ జిల్లా పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. జిల్లా ఎస్పీ శ్రీమతి డి. జానకి, ఐపీఎస్ ఆదేశాల మేరకు మహబూబ్‌నగర్ వన్‌టౌన్ ఇన్స్పెక్టర్ అప్పయ్య కోయిలకొండ ఎక్స్‌రోడ్ వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక చెక్‌పోస్ట్‌ను బుధవారం సందర్శించి తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా చెక్‌పోస్ట్ వద్ద విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి ఆయన పలు సూచనలు చేశారు. బక్రీద్ పండుగ నేపథ్యంలో గోవుల అక్రమ రవాణాను అరికట్టేందుకు వాహనాల తనిఖీలను మరింత కట్టుదిట్టంగా నిర్వహించాలని ఆదేశించారు. అనుమానాస్పద వాహనాలను పూర్తిస్థాయిలో తనిఖీ చేసి, నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణ తో పాటు అక్రమ రవాణా నివారణకు పోలీస్ శాఖ, పశుసంవర్ధక శాఖ, రెవెన్యూ శాఖల సమన్వయంతో ప్రత్యేక చర్యలు కొనసాగుతున్నాయని అధికారులు తెలిపారు. కోయిలకొండ ఎక్స్‌రోడ్ చెక్‌పోస్ట్ వద్ద పశుసంవర్ధక శాఖ సిబ్బంది, రెవెన్యూ అధికారులు, పోలీస్ శాఖ సిబ్బంది సంయుక్తంగా విధులు నిర్వహిస్తున్నారు.

# వాట్సప్ లో గ్రేటర్ సేవలు

హైదరాబాద్ : హైదరాబాద్‌లో బర్త్ సర్టిఫికెట్ సవరణ కోసమో లేదా ప్రాపర్టీ ట్యాక్స్ చెల్లింపు కోసమో ప్రభుత్వ ఆఫీస్‌ల చుట్టూ తిరగడం అంటే అగ్నిపరీక్షే. కానీ, మారుతున్న కాలంతోపాటు పాలన కూడా ప్రజల అరచేతిలోకి వచ్చేసింది. తెలంగాణ ప్రభుత్వ ఐటీ, కమ్యూనికేషన్ల విభాగం ఆధ్వర్యంలోని మీ సేవ ప్లాట్‌ఫామ్, గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ప్రజల కోసం విప్లవాత్మక మార్పులు చేపట్టింది. తెలంగాణ మీ సేవ ప్లాట్‌ఫామ్ తన వాట్సాప్ చాట్‌బాట్ సేవలను మరింత విస్తరించింది. గతంలో ఉన్న సేవల కంటే అదనంగా, ఇప్పుడు తొమ్మిది కొత్త జీహెచ్‌ఎంసీ సేవలను ఈ డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లో చేర్చారు. దీని వల్ల హైదరాబాద్ నివాసితులు తమ ఇంటి నుంచే కేవలం ఒక వాట్సాప్ మెసేజ్‌తో తమ పనులను పూర్తి చేసుకోవచ్చు. కార్యాలయాలకు వెళ్లి గంటల తరబడి వేచి చూడాల్సిన అవసరం లేకుండానే, నేరుగా చాట్ ఇంటర్‌ఫేస్ ద్వారా దరఖాస్తు చేసుకోవడానికి వీలు కలుగుతుంది. ఆస్తి పన్ను సేవలు, పన్ను చెల్లింపులు, వివరాలు అందుబాటులోకి వచ్చాయి. వ్యాపారస్తులు సులభంగా తమ లైసెన్స్‌లను అప్‌డేట్? చేసుకోవచ్చు. పేర్లు లేదా ఇతర వివరాలు జనన ధృవీకరణ పత్రాల్లో సవరణలు ఉంటే సరిదిద్దుకోవచ్చు. ప్రాపర్టీ డోర్ నంబర్ సవరణ చేసుకోవచ్చు. పేరు మార్పు, సవరణ, ఇంటి వద్ద జరిగిన జననాల నమోదు, ఇంటి వద్ద జరిగిన మరణాల నమోదు, ఇతర పౌర సేవలు ఇందులో పొందవచ్చు. తెలంగాణ ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా పౌర సేవలను డిజిటలైజ్ చేయాలనే లక్ష్యంతో ఈ చర్యలు చేపట్టింది. ప్రతి ఒక్కరి దగ్గర స్మార్ట్ ఫోన్, వాట్సాప్ అందుబాటులో ఉన్నాయి. ఇతర యాప్‌లు డౌన్‌లోడ్ చేయాల్సిన అవసరం లేకుండా నేరుగా పని పూర్తి అవుతుంది. ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లే శ్రమ, రవాణా ఖర్చులు తప్పుతాయి. మధ్యవర్తుల ప్రమేయం లేకుండా నేరుగా ప్రభుత్వం నుంచే సేవలు పొందవచ్చు. గత ఏడాది నవంబర్ 18న ప్రారంభమైన ఈ వాట్సాప్ ఛానెల్‌కు ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోంది. ముఖ్యంగా ఆదాయ ధృవీకరణ పత్రాలు, పోలీసు చాలనాలు, విద్యుత్ బిల్లుల చెల్లింపుల కోసం ప్రజలు దీనిని విరివిగా వాడుతున్నారు. మీసేవ వాట్సాప్ సేవలను ఉపయోగించుకోవడం చాలా సులభం. దీని కోసం మీరు ఫాలో చేయాల్సిన స్టెప్స్ ఉన్నాయి ముందుగా మీరు 8096958096 నెంబర్‌ను సేవ్ చేసి పెట్టుకోవాలి. వాట్సాప్‌లోకి వెళ్లి ఈ నెంబర్‌కు హాయ్, హలో అని మెసేజ్ చేయాలి. మీరు మెసేజ్ పంపగానే చాట్‌బాట్ స్పందిస్తుంది. స్క్రీన్‌పై కనిపించే ప్రాంప్ట్‌లను అనుసరిస్తూ మీకు కావాల్సిన సేవను ఎంచుకోండి. ఒక వేళ ఆ సేవకు ఫీజు ఉంటే అక్కడే ఉన్న లింక్ ద్వారా ఆన్‌లైన్‌లో పేమెంట్ పూర్తి చేయవచ్చు.

# కామన్ మ్యాన్ పై పెట్రో భారం ఎఫెక్ట్...


హైదరాబాద్ : సామాన్యుడి జేబుకు మళ్లీ చిల్లులు పడబోతున్నాయి. ఇంధన ధరల పెంపు కేవలం వాహనదారులకే పరిమితం అనుకుంటే పొరపాటే.. దీని ప్రభావం ప్రతి సామాన్యుడి వంటింటి బడ్జెట్‌పై తీవ్రంగా పడనుందని ఆర్థిక నిపుణులు హెచ్చరిస్తున్నారు. దేశవ్యాప్తంగా ఇటీవల పెరిగిన పెట్రోల్, డీజిల్ ధరలతో ఆర్థిక వ్యవస్థలో ద్రవ్యోల్బణంమళ్లీ పడగ విప్పునుందనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. రాబోయే రోజుల్లో రిటైల్ ద్రవ్యోల్బణం ఏకంగా 5 శాతం మార్కును తాకే అవకాశం ఉందని ఆర్థికవేత్తలు అంచనా వేస్తున్నారు. ఈ ప్రతికూల పరిణామాల నేపథ్యంలో భారతీయ రిజర్వ్ బ్యాంక్ వడ్డీ రేట్ల తగ్గింపు విషయంలో వెనక్కి తగ్గే సూచనలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.ఇంధన ధరల పెంపుతో దేశవ్యాప్తంగా రవాణా ఖర్చులు విపరీతంగా పెరుగుతాయి. దేశంలో సరుకు రవాణా వ్యవస్థ అంతా దాదాపుగా డీజిల్‌తో నడిచే భారీ ట్రక్కుల పైనే ఆధారపడి ఉంది. డీజిల్ రేటు పెరిగితే.. కూరగాయలు, పాలు, కిరాణా సరుకుల నుంచి ఎఫ్‌ఎంసీజీ ఉత్పత్తుల వరకు ప్రతి వస్తువు రవాణా భారం అమాంతం పెరుగుతుంది. ఈ అదనపు వ్యయాన్ని కంపెనీలు తమ లాభాల్లోంచి భరించవు, అంతిమంగా వినియోగదారుడి (సామాన్యుడి) పైనే మోపుతాయి. ఈ చైన్ రియాక్షన్ కారణంగానే నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్ని తాకుతాయని, తద్వారా ద్రవ్యోల్బణం మళ్లీ 5 శాతం వైపు పరుగులు తీస్తుందని నిపుణులు విశ్లేషిస్తున్నారు.ఇదే సమయంలో గృహ, వాహన రుణాలు తీసుకున్న సామాన్యులకు, మధ్యతరగతి వర్గాలకు ఆర్బీఐ చేదువార్త చెప్పేందుకు సిద్ధమవుతోంది. ద్రవ్యోల్బణం అదుపులోకి వస్తే ఆర్బీఐ రెపో రేటు తగ్గిస్తుందని, తద్వారా ఈఎంఐభారం తగ్గుతుందని ఎంతోకాలంగా ఆశగా ఎదురుచూస్తున్న వారికి నిరాశే ఎదురుకానుంది. భారతీయ రిజర్వ్ బ్యాంక్ ప్రాథమిక లక్ష్యం ద్రవ్యోల్బణాన్ని అదుపులో ఉంచడమే. కన్స్యూమర్ ప్రైస్ ఇండెక్స్ ఆధారిత రిటైల్ ద్రవ్యోల్బణాన్ని 4 శాతం వద్ద స్థిరంగా ఉంచాలని ఆర్బీఐ టార్గెట్ పెట్టుకుంది. కానీ ఇప్పుడు ఇంధన ధరల సెగతో అది 5 శాతానికి చేరువవుతుండటంతో, ఆర్బీఐ తన విధాన నిర్ణయాల్లో మరింత ఆచితూచి వ్యవహరించనుంది. త్వరలో జరగబోయే ద్రవ్య పరపతి విధాన కమిటీసమావేశంలో వడ్డీ రేట్లను యథాతథంగా ఉంచే అవకాశాలే ఎక్కువగా ఉన్నాయని ఆర్థికవేత్తలు అంటున్నారు.ఒకవైపు పెరిగిన పెట్రోల్, డీజిల్ ధరలు.. దానికి తోడు ఆకాశాన్నంటుతున్న కూరగాయలు, కిరాణా సరుకుల ఖర్చులు.. మరోవైపు ఏమాత్రం తగ్గని బ్యాంక్ ఈఎంఐల భారం. వెరసి ప్రస్తుత ఈ ఆర్థిక పరిణామాలు రాబోయే త్రైమాసికంలో సామాన్యుడిని ఆర్థికంగా మరింత ఉక్కిరిబిక్కిరి చేయడం ఖాయంగా కనిపిస్తోంది.

# జూన్ 5 తర్వాతే తెలంగాణకు రుతుపవనాలు

హైదరాబాద్ : ఈ ఏడాది భారత్‌లో పలు రాష్ట్రాల్లో వర్షపాతం సాధారణం కంటే తక్కువగా ఉంటుందని కొన్ని రోజుల కిందట ఐఎండీ తెలిపింది. అయితే ఈ ఏడాది వానాకాలం ఆలస్యంగా ప్రారంభం కానుంది. నైరుతి రుతుపవనాలు జూన్ ఐదో తేదీ తర్వాతే తెలంగాణ రాష్ట్రాన్ని తాకే అవకాశాలు ఉన్నాయని హైదరాబాద్ వాతావరణ శాఖ వెల్లడించింది. దేశ దక్షిణ ప్రాంతాన్ని మే 25 నాడే తాకుతాయని తొలుత అంచనా వేశారు. కానీ ఎల్‌నినో పరిస్థితుల కారణంగా నైరుతి రుతుపవనాల కదలికల్లో వేగం తగ్గిందని అధికారులు తెలిపారు. హిందూ మహాసముద్రం, బంగాళాఖాతంలో విస్తరిస్తూ వచ్చిన నైరుతి రుతుపవనాలు ప్రస్తుతం శ్రీలంక సగం వరకు వచ్చి నిలిచిపోవడంతో ఆలస్యం కానుంది. సాధారణంగా మే చివరికల్లా తెలంగాణను తాకాల్సిన రుతుపవనాలు, ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో జూన్ 5 నుంచి 10వ తేదీ మధ్య వచ్చే అవకాశం ఉందని అంచనా వేశారు. ఈ కారణాలతో ఈ ఏడాది సాధారణం కంటే వర్షపాతం తక్కువ నమోదయ్యే ప్రమాదం ఉందని భారత వాతావరణ శాఖ పేర్కొంది. జూన్, జులై, ఆగస్టు, సెప్టెంబరు నెలల్లోనూ వర్షాలపై ప్రభావం పడుతుందని తెలుస్తోంది. తెలంగాణలో భానుడి భగభగలు ఇలాగే కొనసాగుతాయని, ప్రజలు జాగ్రత్తగా ఉండాలని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఎండ తీవ్రత అధికంగా ఉండటం, ప్రజలు వడదెబ్బతో అధిక సంఖ్యలో చనిపోతుండటంతో కొన్ని జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ అయింది. జయశంకర్ భూపాలపల్లి, భద్రాద్రి కొత్తగూడెం, ములుగు, ఖమ్మం జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేయగా, అక్కడ 45 డిగ్రీల కంటే ఎక్కువ ఉష్ణోగ్రతలు నమోదు కానున్నాయి. ముఖ్యంగా కొన్ని జిల్లాల్లో వడగాలులు వీస్తున్నందున ప్రజలు పిట్టల్లా రాలిపోతున్నారు. ఎన్నో కుటుంబాలలో ఎండ తీవ్రత, వడగాలులు తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. అదే సమయంలో ద్రోణి కారణంగా కొన్ని జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో కూడిన తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపారు. మరోవైపు నైరుతి రుతుపవనాల రాక ఆలస్యం కావడంతో రాష్ట్రం నిప్పుల కుంపటిలా మారింది. ఏపీలో సోమవారం ఒక్కరోజే 18 మంది చనిపోగా, తెలంగాణలో 54 మంది వడదెబ్బ, ఎండ తీవ్రత కారణంగా చనిపోయారు. రాష్ట్రంలోని 13 జిల్లాల్లో 46 డిగ్రీల పైన, మరో 6 జిల్లాల్లో 45.2 నుంచి 45.8 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. 16 జిల్లాల్లోని 145 మండలాల్లో తీవ్ర వడగాలులు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని 19 మండలాలు, మంచిర్యాలలో 17 మండలాల్లో, సూర్యాపేటలో 14, ఖమ్మంలో 13 మండలాలతో పాటు ఉత్తర తెలంగాణ జిల్లాలు ప్రజలు ఎండ వేడికి తట్టుకోలేకపోతున్నారు. ఏపీలోని కృష్ణా జిల్లాలోని కంకిపాడు, పెనమలూరు ప్రాంతాలలో గరిష్ఠంగా 48.1 డిగ్రీల రికార్డు స్థాయి ఉష్ణోగ్రత నమోదు కాగా, బాపట్ల జిల్లా కూచినపూడిలో 46.4 డిగ్రీల ఉష్ణోగ్రత రికార్డయింది. మొత్తం 14 జిల్లాల పరిధిలో ఉన్న 115 మండలాల్లో ఉష్ణోగ్రతలు 44 డిగ్రీల మార్కును దాటడం ఎండ తీవ్రతను తెలుపుతుంది. ద్దం పడుతోంది. ఈ కోరలు చాచిన ఎండల వడదెబ్బకు తాళలేక వేర్వేరు ప్రాంతాల్లో పలువురు ప్రాణాలు కోల్పోతున్నారు. మే నెలాఖరు వరకు ఎండల తీవ్రత ఇలాగే ఉంటుందని, ప్రజలు ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఇళ్ల నుంచి బయటకు రావొద్దని సూచిస్తున్నారు.

## స్టాక్ మార్కెట్లో ఏఐ కంపెనీలు

ముంబై : ప్రపంచవ్యాప్తంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సృష్టిస్తున్న ప్రకంపనలు గ్లోబల్ స్టాక్ మార్కెట్ ముఖచిత్రాన్నే మార్చేస్తున్నాయి. దలాల్ స్ట్రీట్‌కు ఊహించని ఎదురుదెబ్బ తగిలింది. ప్రపంచంలోనే ఐదో అతిపెద్ద స్టాక్ మార్కెట్‌గా సగర్వంగా వెలుగొందుతున్న భారత్‌ను.. ఒక చిన్న దేశమైన తైవాన్ వెనక్కి నెట్టేసింది. ఈ ఊహించని దెబ్బతో అమెరికా, చైనా, జపాన్, హాంకాంగ్‌ల తర్వాత ప్రపంచంలో ఐదో అతిపెద్ద ఈక్విటీ మార్కెట్‌గా తైవాన్ అవతరించి సంచలనం సృష్టించింది.తాజా అంచనాల ప్రకారం తైవాన్ స్టాక్ మార్కెట్ విలువ 4.95 ట్రిలియన్ డాలర్లకు చేరుకోగా, భారత మార్కెట్ విలువ 4.92 ట్రిలియన్ డాలర్ల వద్ద నిలిచి ఆరో స్థానానికి పడిపోయింది.



# వైభవ్ కోసం మూడు ప్రణాళికలు సిద్ధం చేశాం: కమిన్స్

ఇంటర్నెట్ డెస్క్: ఐపీఎల్ 2026 ఎలిమినేటర్ పోరుకు రంగం సిద్ధమైంది. నేడు ముల్లాన్‌పూర్ వేదికగా సన్‌రైజర్స్ హైదరాబాద్, రాజస్థాన్ రాయల్స్ జట్లు తలపడనున్నాయి. ఈ మ్యాచ్‌లో ఓడిన జట్టు టోర్నీ నుంచి నిష్క్రమిస్తుంది. కాగా గెలిచిన జట్టు క్వాలిఫయర్ 2కి అర్హత సాధించి అక్కడ గుజరాత్ టైటాన్స్‌తో అమీతుమీ తేల్చుకుంటుంది. ఇప్పటికే ఈ సీజన్‌లో రాజస్థాన్‌పై రెండు విజయాలు సాధించిన ఎస్ఆర్‌హెచ్.. ఈ కీలక పోరులో నెగ్గి వరుసగా మూడో విజయాన్ని అందుకోవాలని చూస్తోంది. అది జరగాలంటే.. ఆర్ఆర్ యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ దూకుడును హైదరాబాద్ బౌలర్లు అడ్డుకోగలగాలి.

ఈ సీజన్‌లో వైభవ్‌పై సన్‌రైజర్స్‌కు మిశ్రమ అనుభవం ఎదురైంది. తొలి మ్యాచ్‌లో అతడిని తక్కువ స్కోరుకే పరిమితం చేసిన హైదరాబాద్ బౌలర్లు.. రెండో మ్యాచ్‌లో మాత్రం అతడి విధ్వంసాన్ని అడ్డుకోలేకపోయారు. ఆ మ్యాచ్‌లో వైభవ్ సెంచరీతో చెలరేగిపోయాడు. అయినప్పటికీ రెండు మ్యాచ్‌ల్లోనూ విజయం మాత్రం సన్‌రైజర్స్‌కే దక్కింది. ఎలిమినేటర్ మ్యాచ్‌కు ముందు ఎస్ఆర్‌హెచ్ కెప్టెన్ ప్యాట్ కమిన్స్ మాట్లాడాడు. వైభవ్‌ను అడ్డుకోవడం కోసం ప్రత్యేక వ్యూహాలు సిద్ధం చేసినట్లు వెల్లడించాడు.

'బౌలర్‌గా మా బలాలేంటి అనేది తెలుసుకోవడం ముఖ్యం. కానీ ప్రత్యర్థి జట్టులో మ్యాచ్‌ను ఒక్కడే మలుపు తిప్పగల ప్లేయర్ ఉంటే అతడికి ప్రత్యేక ప్రణాళిక అవసరం. అందుకే వైభవ్ కోసం మూడు ప్రణాళికలు సిద్ధం చేశాం. గత మ్యాచ్‌లో అతడు మా మీద సెంచరీ చేసినా.. కొన్ని దశల్లో మేము అతడిని బాగా కట్టడి చేశాం. కొన్ని సందర్భాల్లో మాత్రం వైభవ్‌ను అడ్డుకోలేకపోయాం. ఆ అనుభవాల నుంచి పాఠాలు నేర్చుకున్నాం. ప్రతి మ్యాచ్ కొత్తగా మొదలవుతుంది. అయితే గత మ్యాచ్‌ల నుంచి నేర్చుకున్న విషయాలు మాత్రం ఉపయోగపడతాయి. ఆర్ఆర్ ఆటగాళ్లపై మాకు స్పష్టమైన అవగాహన ఉంది. మా ప్లేయర్లు కూడా గత విజయాల అనుభవాన్ని ఉపయోగించుకుంటారు' అని కమిన్స్ తెలిపాడు.




స్పోర్ట్స్ డెస్క్: ఇటీవలే ఐపీఎల్ 2026 మ్యాచ్ సందర్భంగా స్టార్ ప్లేయర్లు విరాట్ కోహ్లీ, ట్రావిస్ హెడ్ మధ్య వివాదం చోటుచేసుకున్న సంగతి తెలిసిందే. ఆ తర్వాత కొందరు ట్రావిస్ హెడ్ భార్య జెస్సికా డేవిస్‌ను, ఆమె కుటుంబాన్ని లక్ష్యంగా చేసుకుని అసభ్యకరమైన కామెంట్లు, బెదిరింపులకు పాల్పడ్డారు. ఈ వేధింపుల గురించి జెస్సికా సోషల్ మీడియాలో స్వయంగా వెల్లడించడంతో ఒక్కసారిగా అందరి దృష్టి ఆమెపై పడింది. ఈ వివాదంతో ట్రావిస్, జెస్సికాల ప్రేమాయణం బయటకు వచ్చింది. వీరి లవ్ స్టోరీ చాలా ట్విస్టులతో సాగింది. మరి.. ఆ వివరాలు ఏమిటో తెలుసుకుందాం...

ట్రావిస్ హెడ్, జెస్సికా ప్రేమ కథ పక్కా సినిమా స్టోరీలానే ఉంటుంది. ఆస్ట్రేలియాలోని అడిలైడ్ నగరంలో జన్మించిన జెస్సికా.. అక్కడే తన పాఠశాల విద్యను పూర్తి చేసింది. స్కూల్ రోజుల్లోనే వీరిద్దరి మధ్య పరిచయం ఏర్పడింది. దాదాపు 15 ఏళ్ల పాటు ఒకరికొకరు మంచి స్నేహితులుగా ఉన్న ఈ జంట.. ఆ తర్వాత ప్రేమలో పడ్డారు. ఆ తర్వాత చాలా కాలం ఈ జంట డేటింగ్ చేసింది. చివరకు 2021 మార్చిలో అధికారికంగా ఎంగేజ్మెంట్ చేసుకున్నారు. ఇక్కడే ఓ ట్విస్ట్ చోటుచేసుకుంది. వీరు పెళ్లి బంధంలోకి అడుగు పెట్టక ముందే తల్లిదండ్రులు అయ్యారు. 2022 సెప్టెంబర్‌లో జెస్సికా ఒక ఆడబిడ్డకు జన్మనిచ్చింది. ఆ పాపకు 'మిలా పేజ్ హెడ్' అని పేరు పెట్టారు. ఏడాది తర్వాత 2023 ఏప్రిల్ 15న అడిలైడ్‌లోని చారిత్రాత్మక పబ్లిక్ మ్యూజియం 'క్యారిక్ హిల్' లో అత్యంత సన్నిహితుల సమక్షంలో వీరిద్దరూ ఘనంగా వివాహం చేసుకున్నారు. పెళ్లి తర్వాత వీరికి ఒక కుమారుడు కూడా జన్మించాడు. పెళ్లికి ముందు జెస్సికా మోడలింగ్ రంగంలో రాణించారు. ఆస్ట్రేలియాలోని పలు టాప్ మోడలింగ్ ఏజెన్సీలతో కలిసి పనిచేసిన ఆమె, తన అద్భుతమైన పర్సనాలిటీతో మోడలింగ్ రంగంలో మంచి గుర్తింపు తెచ్చుకుంది. ఇప్పటికీ ఆమె పాత ఫొటోషూట్లు ఇంటర్నెట్‌లో వైరల్ అవుతుంటాయి. ప్రస్తుతం జెస్సికా బిజినెస్‌వుమన్‌గా రాణిస్తున్నారు. సిడ్నీ, కాన్‌బెర్రా వంటి పెద్ద నగరాల్లో జెస్సికాకు పలు రెస్టారెంట్లు ఉన్నాయి. ప్రస్తుతం ఆమె ఫుడ్ బిజినెస్‌లో బిజీగా ఉంటూ మంచి లాభాలను ఆర్జిస్తున్నారు.




మొదటి పేజీ తరువాయి

స్పోర్ట్స్ డెస్క్: ఐపీఎల్ 2026 ఎలిమినేటర్‌లో భాగంగా రాజస్థాన్ రాయల్స్‌తో అమీతుమీ తేల్చుకునేందుకు సన్ రైజర్స్ హైదరాబాద్ సిద్ధమైంది. ఇవాళ చండీగఢ్ వేదికగా ఈ రెండు జట్లు తలపడనున్నాయి. ఈ మ్యాచ్‌లో గెలిచి క్వాలిఫయర్ 2కు అర్హత సాధించాలని ఎస్ఆర్‌హెచ్ పట్టుదలతో ఉంది. ఈ నేపథ్యంలో హైదరాబాద్ తుది జట్టు ఎలా ఉంటుందా అనే ఆసక్తి ఆరెంజ్ ఆర్మీ అభిమానుల్లో ఉంది. ఈ 'డూ ఆర్ డై' మ్యాచ్‌లోఎస్ఆర్‌హెచ్ రెండు కీలక మార్పులతో బరిలోకి దిగనుందని సమాచారం.

మిడిలార్డర్ బ్యాటరైన స్మరణ్ రవిచంద్రన్‌ను పక్కన పెట్టాలని ఆరెంజ్ ఆర్మీ మేనేజ్‌మెంట్ భావిస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. గత కొన్ని మ్యాచ్‌ల్లో స్మరణ్‌కు అవకాశం లభించినప్పటికీ సద్వినియోగం చేసుకోలేకపోయాడు. ఈ క్రమంలోనే ఇవాళ జరిగే కీలక పోరుకు అతడిని తప్పించనున్నట్లు సమాచారం. అతడి స్థానంలో ఫినిషర్ అనికేత్ వర్మను తుది జట్టులోకి తీసుకోవాలని సన్ రైజర్స్ భావిస్తుందంట.

అనికేత్ కూడా అంచనాలకు తగ్గట్టు రాణించలేకపోయాడు. గత సీజన్‌లో దుమ్మురేపిన అనికేత్.. ఈ సీజన్‌లో మాత్రం విఫలమయ్యాడు. 8 ఇన్నింగ్స్‌లో కేవలం 79 పరుగులు చేశాడు. కానీ గత సీజన్‌లో అతడి ప్రదర్శన చూసిన ఆరెంజ్ ఆర్మీ మేనేజ్‌మెంట్.. అతడిపై నమ్మకం ఉంచిన మరో అవకాశం ఇవ్వనున్నట్లు సమాచారం. ఇక ఎస్ఆర్‌హెచ్ చివరి లీగ్ మ్యాచ్‌లో ఆడిన హర్షల్ పటేల్‌ను కూడా తిరిగి బెంచ్‌కే పరిమితం చేయనున్నట్లు క్రీడా వర్గాల్లో టాక్ వినిపిస్తోంది. అతడి స్థానంలో యువ పేసర్ ప్రఫుల్ హింగేకు అవకాశమివ్వన్నట్లు తెలుస్తోంది. మొత్తంగా స్మరణ్, హర్షల్ పటేల్ పై వేటు పడే అవకాశం ఉందని సమాచారం. ఈ వార్తల్లో నిజమెంతో తెలియాలంటే.. మరికొన్ని గంటలు ఆగాల్సిందే.

పిచ్ రిపోర్ట్:

నివేదికల ప్రకారం.. రాజస్థాన్ రాయల్స్, సన్ రైజర్స్ హైదరాబాద్ మధ్య జరిగే ఎలిమినేటర్ మ్యాచ్ కోసం మహారాజా యాదవేంద్ర సింగ్ పీసీఏ స్టేడియంలోని పిచ్ 4ను ఉపయోగించనున్నారు. ఇదే పిచ్‌పై పంజాబ్ కింగ్స్ తమ చివరి హోమ్ మ్యాచ్ ఆడి 200 పరుగులకు పైగా ఉన్న టార్గెట్‌ను సునాయాసంగా ఛేదించింది. వైభవ్ సూర్యవంశీ, అభిషేక్ శర్మ, హెన్రిచ్ క్లాసెన్, యశస్వి జైస్వాల్, ఇషాన్ కిషన్ వంటి విధ్వంసక ప్లేయర్లు ఉండటంతో ఎస్ఆర్‌హెచ్, ఆర్ఆర్ జట్లు టాస్ గెలిస్తే తొలుత బ్యాటింగ్ చేయడానికి ఇష్టపడతాయని క్రీడా నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

**ఎలిమినేటర్ మ్యాచ్‌కు ఎస్ఆర్‌హెచ్ తుది జట్టు(అంచనా):**

అభిషేక్ శర్మ, ట్రావిస్ హెడ్, ఇషాన్ కిషన్(వికెట్ కీపర్), హెన్రిచ్ క్లాసెన్, నితీశ్ కుమార్ రెడ్డి, సలీల్ అరోరా, అనికేత్ వర్మ, ప్యాట్ కమిన్స్ (కెప్టెన్), శివంగ్ కుమార్, ఈషాన్ మలింగ, సాకిబ్ హుస్సేన్.

ఇంపాక్ట్ సబ్: ప్రఫుల్ హింగే.

# టీమిండియా టీ20 కెప్టెన్సీ రేసులో ఊహించని ప్లేయర్!



స్పోర్ట్స్ డెస్క్: ఐపీఎల్ 2026లో భాగంగా ధర్మశాల వేదికగా జరిగిన క్వాలిఫయర్-1లో గుజరాత్ టైటాన్స్‌పై 92 పరుగుల తేడాతో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు ఘన విజయం సాధించింది. దీంతో ఆర్సీబీ వరుసగా రెండోసారి తమ ఫైనల్ బెర్త్‌ను ఖరారు చేసుకుంది. బెంగళూరు ఫైనల్‌కు చేరడంలో ఆ జట్టు కెప్టెన్ రజత్ పాటిదార్ కీలక పాత్ర పోషించాడు. పాటిదార్ కేవలం 33 బంతుల్లో 9 సిక్సర్లు, 5 ఫోర్లతో 93 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. ఈ మ్యాచ్ ద్వారా పాటిదార్ వ్యక్తిగత ప్రదర్శనతో పాటు కెప్టెన్సీ పరంగా వందకు వంద మార్కులు కొట్టేశాడు. ఈ నేపథ్యంలో పాటిదార్ బ్యాటింగ్, కెప్టెన్సీ నైపుణ్యంపై భారత మాజీ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ ప్రశంసల వర్షం కురిపించాడు. 17 ఓవర్‌లో ఓవర్‌లో కగిసో రబాడా బౌలింగ్‌లో పాటిదార్ ఆడిన షాట్‌ను అశు ప్రత్యేకంగా ప్రస్తావించాడు. 'కగిసో రబాడా వేసిన ఓ ఫాస్ట్ డెలివరీని పాటిదార్ బ్యాక్‌ఫుట్‌పై వెళ్లి కొట్టిన సిక్స్.. 'షాట్ ఆఫ్ ది డే' అని చెప్పవచ్చు. బహుశా ఈ టోర్నమెంట్‌లోనే అత్యుత్తమ షాట్‌గా ఇది నిలుస్తుంది. ఆ పొజిషన్ నుంచి అతను అంత పవర్‌ను ఎలా జనరేట్ చేయగలిగాడో నాకు ఇప్పటికీ అర్థం కావడం లేదు' అని అశ్విన్ పేర్కొన్నాడు. 'ఈ ఇన్నింగ్స్‌కు ముందు వరకు కెప్టెన్సీ, బ్యాటింగ్ పరంగా పాటిదార్ కంటే శ్రేయస్ అయ్యర్ కొంచెం బెటర్‌గా కన్పించాడు. ?కానీ ఈ మ్యాచ్‌తో పాటిదార్ శ్రేయస్‌ను వెనక్కి నెట్టాడు. సాధారణంగా పాటిదార్ స్పిన్ బౌలింగ్‌లో బాగా ఆడుతాడని అందరికీ తెలుసు.

# శ్రేయస్ అయ్యర్ ఎక్కడ?.. కేకేఆర్ ఎక్స్ పోస్ట్‌పై అభిమానుల ఆగ్రహం!



ఇంటర్నెట్ డెస్క్: కోల్‌కతా నైట్ రైడర్స్.. రెండేళ్ల క్రితం సరిగ్గా ఇదే రోజు తమ మూడో ఐపీఎల్ ట్రోఫీని ముద్దాడింది. దాదాపు పదేళ్ల తర్వాత 2024లో అప్పటి కెప్టెన్ శ్రేయస్ అయ్యర్.. కేకేఆర్‌కు కప్పును అందించాడు. తాజాగా కేకేఆర్ తమ ఎక్స్ ఖాతాలో దానికి సంబంధించిన ఫొటోలను పోస్ట్ చేసింది. అయితే ఇక్కడే ఓ వివాదం తెరపైకి వచ్చింది. కేకేఆర్ చేసిన ఆ పోస్ట్ అభిమానుల ఆగ్రహానికి కారణమైంది. అసలు ఏమైందంటే.. 2024 ఐపీఎల్ సీజన్‌లో శ్రేయస్ అయ్యర్ నాయకత్వంలో కోల్‌కతా నైట్ రైడర్స్..సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో గెలిచి ట్రోఫీని ముద్దాడింది. దాదాపు పదేళ్ల సుదీర్ఘ నిరీక్షణ తర్వాత మూడోసారి ఐపీఎల్ కప్పు నెగ్గింది. ఆ విజయానికి రెండేళ్లు అవ్వడంతో కేకేఆర్ ఎక్స్‌లో పోస్ట్ పెట్టింది. ఫైనల్ మ్యాచ్‌లో కీలక పాత్ర పోషించిన ప్లేయర్ల ఫొటోలను కూడా షేర్ చేసింది. అయితే ఆ టైటిల్ విజయంలో జట్టును ముందుండి నడిపించిన కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ మాత్రం ఏ ఫొటోలోనూ కనిపించలేదు. దీంతో అభిమానులు సోషల్ మీడియాలో కేకేఆర్‌పై విమర్శలు గుప్పిస్తున్నారు. జట్టుకు మూడో ఐపీఎల్ టైటిల్ అందించిన కెప్టెన్‌కు తగిన గుర్తింపు ఇవ్వలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. 'ట్రోఫీ గెలిపించిన కెప్టెన్ ఎక్కడ?', 'శ్రేయస్‌ను ఎందుకు పక్కన పెడుతున్నారు?' అంటూ ప్రశ్నిస్తున్నారు. 2025 మెగా వేలానికి ముందు శ్రేయస్ అయ్యర్‌ను కేకేఆర్ విడుదల చేసిన సంగతి తెలిసిందే. అప్పటి నుంచి అభిమానుల్లో అసంతృప్తి కనిపిస్తోంది. టైటిల్ గెలిపించిన నాయకుడిని వదులుకోవడం సరైన నిర్ణయం కాదంటూ అప్పట్లోనూ విమర్శలు వచ్చాయి. అనంతరం అయ్యర్ పంజాబ్ కింగ్స్‌లో చేరాడు. ఇక ఐపీఎల్ 2026లో అజింక్య రహానె నాయకత్వంలో బరిలోకి దిగిన కేకేఆర్.. ఆశించిన ఫలితాలు సాధించలేకపోయింది. 14 మ్యాచ్‌ల్లో కేవలం ఆరు విజయాలతో లీగ్ స్టేజ్‌లోనే టోర్నీ నుంచి నిష్క్రమించింది. మరోవైపు శ్రేయస్ అయ్యర్ సారథ్యంలో పంజాబ్ కింగ్స్ కూడా ఆశాజనక ఆరంభం చేసినప్పటికీ.. వరుస పరాజయాలతో ప్లే ఆఫ్స్ అవకాశాలు కోల్పోయింది.

# మహిళా ఆర్థిక స్వావలంబనే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం





## -ఎమ్మెల్యే మేఘారెడ్డి

**వనపర్తి, సమయం ప్రతినిధి:** మహిళా ఆర్థిక స్వావలంబనే పరమావధిగా... తెలంగాణ రాష్ట్రంలోని కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతుందనీ వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి పేర్కొన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా బుధవారం జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో జిల్లా మహిళా సమైక్య ఆవరణలో బుధవారం నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి పాల్గొన్నారు. ముందుగా మహిళా సమాఖ్య భవనంలో నూతనంగా ఏర్పాటుచేసిన వీడియో కాన్ఫరెన్స్ హాల్ను ఆయన ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ దివంగత మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ వైఎస్ రాజశేఖర్ రెడ్డి పాలనలో మహిళలకు భావన వంటిపై రుణాలు ఇచ్చారని నేడు రేవంత్ రెడ్డి పాలనలో మహిళలను మహారాణులుగా చేయాలన్న ఉద్దేశంతో వడ్డీ లేని రుణాలు ఇస్తున్నారని ఎమ్మెల్యే చెప్పారు పదేళ్ల బిఆర్ఎస్ పాలనలో మహిళా సంఘాలు పూర్తిగా నిర్వీర్యమైపోయాయని ఆయన అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మొదటి సంతకం మహిళలు ఆర్టీసీలో ఉచిత ప్రయాణం చేసే ఫైల్ పైనే సంతకం చేశారని ఆయన గుర్తుకు చేశారు. ఈ ఉచిత ప్రయాణం ద్వారా కేవలం వనపర్తి నియోజకవర్గం సంబంధించి ఇప్పటివరకు 30 కోట్ల 32 లక్షల రూపాయలు ప్రభుత్వానికి చెల్లించిందని ఆయన వివరించారు. 1996లో మహిళా సంఘాలు ఏర్పాటు అయ్యాయని అప్పుడు కేవలం 10 వేల రూపాయలు మాత్రమే మహిళా సంఘాలకు రుణంగా ఇచ్చేవారని నేడు 20 లక్షల రూపాయలు మహిళా సంఘాలకు వడ్డీ లేకుండా రుణం ఇస్తున్న ఏకైక ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వమేనని ఎమ్మెల్యే పేర్కొన్నారు. మహిళా సంఘాలకు ప్రత్యేక గ్రామంలో మహిళా సంఘం భవనం ఉండేలా నేడు కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు చేపట్టిందని అందులో భాగంగానే రాష్ట్రవ్యాప్తంగా 12,700 మహిళా సంఘాల భవన నిర్మాణాలను చేపట్టనున్నట్లు ఆయన చెప్పారు. కేవలం వనపర్తి నియోజకవర్గంలో 104 మహిళా సంఘం భవనాల నిర్మాణానికి చర్యలు చేపట్టామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. మహిళా సంఘంలోని మహిళలకు 10 లక్షల బీమా కల్పిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఇప్పటివరకు 6000 సంఘాలకు 324 కోట్ల రూపాయల రుణాలు ఇచ్చినట్లు వారి తెలిపారు. ఈ సందర్భంగా అంగన్వాడి కేంద్ర చిన్నారులకు మంజూరైన యూనిఫారం లను చిన్నారులకు అందజేశారు. నిరవధిక నిరసనలు చేపట్టిన వివో ఏలు జూన్ రెండో తారీకు వరకు సమయమైన పాటించాలని జూన్ రెండు తర్వాత ప్రభుత్వంతో మాట్లాడి వారి సమస్యలను పరిష్కరించనున్నట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. అనంతరం డిఆర్డిఓ వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాళ్లను ఎమ్మెల్యే సందర్శించారు. వారు చేసిన ఉత్పత్తుల గురించి అడిగి తెలుసుకున్నారు మహిళా అభివృద్ధి కోసం ప్రభుత్వం ఎంతైనా సహాయ సహకారుల అందిస్తుందని స్వయం సహాయ కోత్పత్తులపై మృతి సారించాలని ఎమ్మెల్యే పేర్కొన్నారు. కార్యక్రమంలో వనపర్తి అడిషనల్ కలెక్టర్ కిమ్యా నాయక్, డి ఆర్ డి ఓ ఉమాదేవి, వనపర్తి మున్సిపల్ చైర్మన్ మాధవి రమేష్, జిల్లా సమైక్య అధ్యక్షురాలు ఇందిర, మండల సమాఖ్య అధ్యక్షురాలు సంధ్యారాణి డబ్ల్యు ఓ సుధారాణి, పట్టణ కౌన్సిలర్లు, APM లు, CC లు, VO లు, అధికారులు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# పాఠశాల విద్యను గాలికి వదిలేసిన రాష్ట్ర ప్రభుత్వం - ఎబివిపి




దేవరకొండ: అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ దేవరకొండ నగర శాఖ ఆధ్వర్యంలో బుధవారం రోజున ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించి అనంతరం ఏబీవీపీ రాష్ట్ర శాఖ పిలుపుమేరకు తెలంగాణ రాష్ట్ర విద్యా విధానంపై ప్రెస్ నోట్ ఇవ్వడం జరిగింది. నీళ్లు నిధులు నియామకాల కోసం ఆనాడు ప్రత్యేక తెలంగాణ కొరకు ఎంతోమంది విద్యార్థులు బలిదానాలు అర్పించి విద్యార్థుల భవిష్యత్తు కోసం కోరుకున్న ప్రత్యేక తెలంగాణ లో ఈరోజు చూసుకున్నట్లయితే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పాఠశాల విద్యను పూర్తిగా గాలికి వదిలేసింది ఎబివిపి రాష్ట్ర హాస్టల్స్ కో కన్వీనర్ యలమల గోపీచంద్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ప్రైవేట్ విద్యాసంస్థలు బ్రాండ్ల పేరిట ఫీజు నియంత్రణ చట్టాన్ని తుంగలో తొక్కుతూ నర్సరీ విద్యార్థులకు లక్షల్లో ఫీజులను వసూలు చేస్తున్నారని పుస్తకాలు యూనిఫాం ల పేరిట ప్రైవేట్ పాఠశాలలు విద్యార్థుల నుండి ఫీజు దోపిడీకి పాలు పడుతున్నారని, బస్సు సౌకర్యం పేరిట అడ్డదారిన వేలు రూపాయలను వసూళ్లు చేస్తున్నారని, ఫిట్నెస్ లేని బస్సులను నడుపుతూ విద్యార్థుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారని, మరోవైపు ప్రభుత్వ పాఠశాలల్లో, గురుకులాల్లో, వసతి గృహాలు మాత్రం అరకొర వసతులు, సౌకర్యాలతో నరక కూపాల్లా ఉన్నాయి అని మరో రెండు వారాల్లో పాఠశాలలు పునః ప్రారంభం కాబోతున్న ఇంకా ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు ఇచ్చే పాఠ్య పుస్తకాల ఊసు అసలే లేదని, రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలల్లో ప్రమాణాలు పడిపోతూ రోజు రోజుకు విద్యార్థుల సంఖ్య పడిపోతుంటే మరో వైపు ప్రైవేట్ పాఠశాలలు పుట్టగొడుగుల్లా విస్తరించి విద్యను వ్యాపారం చేస్తున్నాయి అని ఈ విషయంలో పట్టించుకోవాల్సిన రాష్ట్ర ప్రభుత్వం ప్రేక్షక పాత్ర పోషిస్తుందని, వెంటనే రాష్ట్ర ప్రభుత్వం ప్రైవేట్ విద్యా సంస్థల విద్యా వ్యాపారని అరి కట్టి, ప్రభుత్వ పాఠశాలను మెరుగు పరుస్తూ రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలలు, గురుకులాలను, వసతి గృహాల వసతులను అభివృద్ధి పరిచి పాఠశాల విద్యలోని ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని లేని పక్షాన రాష్ట్ర వ్యాప్తంగా ఎబివిపి భారీ విద్యార్థి ఉద్యమం చేస్తుందని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో ఎబివిపి నగర కార్యదర్శి పగిళ్ల విక్రం, నగర జాయింట్ సెక్రెటరీ రాకేష్, గుండాల శివరామరాజు, అరవింద్, శంకర్, కైలాష్ తదితరులు పాల్గొన్నారు.

# పాలమూరుకు తగ్గనున్న నీటి కష్టాలు

## బ్రిడ్జి నిర్మాణానికి రెండు రాష్ట్రాలు అంగీకారం

మహబూబ్ నగర్ : తెలంగాణ, కర్ణాటక అంతరాష్ట్ర సరిహద్దుల్లో కృష్ణానదిపై ఒక కొత్త బ్యారేజీతో పాటు వంతెనను నిర్మించేందుకు రెండు రాష్ట్రాల మధ్య కీలక చర్చలు ప్రారంభమయ్యాయి. ఉన్నత స్థాయి భేటీలో కర్ణాటక ప్రభుత్వం ఈ ప్రతిపాదనను తీసుకురాగా.. తెలంగాణ ప్రభుత్వం కూడా దీనిపై సానుకూలత వ్యక్తం చేస్తూ పరిశీలిస్తోంది. నారాయణపేట జిల్లా మక్తల్ నియోజకవర్గం కృష్ణా మండల పరిధిలోని కొల్పూరు గ్రామానికి, కర్ణాటకలోని రాయచూరు జిల్లా కోర్తుండా గ్రామానికి మధ్యలో ఈ బ్యారేజీని నిర్మించాలని ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. జూరాల జలాశయానికి ఎగువన, కర్ణాటకలోని గుర్జాపూర్, గూగల్ చిన్న బ్యారేజీలకు దిగువన ఈ కొత్త ప్రాజెక్టు రానుంది. సుమారు రెండు టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యంతో ఈ బ్యారేజీని నిర్మిస్తే.. తెలంగాణలోని మక్తల్ నియోజకవర్గ పరిధిలోని అనేక గ్రామాలకు తాగు, సాగునీటి అవసరాలు పూర్తిగా తీరనున్నాయి. నీటి లభ్యతతో పాటు ఈ బ్యారేజీపై వంతెనను కూడా నిర్మించడం వల్ల ప్రస్తుతం రాయచూరు సమీపంలోని శక్తినగర్, కృష్ణా మండలం మధ్య ఉన్న పాత వంతెనపై ట్రాఫిక్ ఒత్తిడి గణనీయంగా తగ్గుతుందని అధికారులు భావిస్తున్నారు. ఈ ప్రాజెక్టుతో పాటు భీమా నదిపైనా మరో చిన్న బ్యారేజీ, వంతెన నిర్మించాలనే ప్రతిపాదనను తెలంగాణ ప్రభుత్వం తెరపైకి తెచ్చింది. సోమవారం నాటి సమావేశంలో తెలంగాణ మంత్రి వాకిటి శ్రీహరి ఈ కొత్త ప్రతిపాదనను కర్ణాటక ప్రతినిధుల ముందుకు తీసుకెళ్లారు. నారాయణపేట జిల్లాలోని తంగడిగి, కర్ణాటకలోని సుగూరు గ్రామాల మధ్య భీమానదిపై 0.25 టీఎంసీల సామర్థ్యంతో దీనిని నిర్మించాలని కోరారు. ఈ చిన్న బ్యారేజీ నిర్మాణం వల్ల ఇరు రాష్ట్రాల సరిహద్దు రైతులకు, ప్రజలకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని అంచనా వేస్తున్నారు. కృష్ణానదిపై ప్రతిపాదించిన ప్రధాన బ్యారేజీని రెండు రాష్ట్రాలు సంయుక్తంగా నిర్మించి వ్యయాన్ని సమానంగా పంచుకోవడం ద్వారా ఉమ్మడిగా ప్రయోజనం పొందవచ్చనే కోణంలో చర్చలు జరుగుతున్నాయి. ఈ అంతరాష్ట్ర ప్రాజెక్టు నిర్మాణ అంచనా వ్యయం దాదాపు రూ.500 కోట్ల వరకు ఉండవచ్చని నీటి పారుదల రంగ నిపుణులు ప్రాథమికంగా లెక్కగట్టారు. కృష్ణానదిపై ప్రతిపాదించిన బ్యారేజీకి సంబంధించి హైడ్రాలజీ, ముంపు ప్రాంతాలు, సాంకేతికాంశాలను క్షుణ్ణంగా ఖరారు చేసేందుకు ఇరు రాష్ట్రాల నీటిపారుదలశాఖల ఇంజినీర్లతో ఒక సంయుక్త కమిటీని ఏర్పాటు చేయాలని సోమవారం నాటి సమావేశంలో నిర్ణయించారు. ఈ ఉమ్మడి కమిటీ క్షేత్రస్థాయిలో పర్యటించి, ప్రాజెక్టు సాధ్యాసాధ్యాలపై సమగ్ర నివేదికను సిద్ధం చేయనుంది. ఆ నివేదిక అందిన తర్వాత రెండు రాష్ట్రాల మంత్రులు, ఉన్నతాధికారులు మరోమారు సమావేశమై తుది నిర్ణయం తీసుకోనున్నారు.

# దుమ్మురేపుతున్న టాలీవుడ్...

హైదరాబాద్ : తమిళ్ సినిమా ఇండస్ట్రీలో ఉన్న హీరోలు దర్శకులు ఒకప్పుడు ఘన విజయాలను సాధిస్తుండేవారు. అక్కడి హీరోలు, దర్శకులు ఇండియన్ సినిమా ఇండస్ట్రీలోనే నెంబర్ వన్ పొజిషన్ లో ఉండేవారు. కానీ ఇప్పుడు రోజులు మారాయి తెలుగు సినిమా ఇండస్ట్రీ సౌత్ సినిమా ఇండస్ట్రీని పక్కకు నెట్టేసి ముందుకు దూసుకెళ్లడమే కాకుండా పాన్ ఇండియా ఇండస్ట్రీని సైతం పక్కన పెట్టేసింది. ప్రస్తుతం ఇండియన్ సినిమా ఇండస్ట్రీలో తెలుగు సినిమా ఇండస్ట్రీ నెంబర్ పొజిషన్లో కొనసాగుతూ ఉండటం విశేషం?ఇక తమిళులు మాత్రం దీనిని ఒప్పుకోవడం లేదు. ఎలాగైనా సరే సూపర్ సక్సెస్ ని సాధించే దిశగా సినిమాలు చేయాలని అక్కడ స్టార్ హీరోలు విపరీతంగా ఆరాటపడుతున్నారు. కానీ రజినీకాంత్, కమల్ హాసన్ తో పాటు విజయ్, సూర్య, విక్రమ్ లాంటి హీరోలు ఎన్ని సినిమాలు చేసినా కూడా మన తెలుగు హీరోల స్టార్ డమ్ ను మ్యాచ్ చేయలేరు. అలాగే మన హీరోల కలెక్షన్స్ ను కొల్లగొట్టలేరు అంటూ చాలామంది కామెంట్స్ చేస్తున్నారు.

# భూవివాదం వెనుక రాజకీయ నేతల హస్తం

హైదరాబాద్ : సినీ గేయరచయిత అనంత్ శ్రీరామ్ సోమవారం పశ్చిమగోదావరి జిల్లా కలెక్టరేట్‌లో ప్రత్యక్షమయ్యారు. జిల్లా యంత్రాంగం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఆయన పాల్గొని, తన కుటుంబానికి ఎదురవుతున్న వేధింపులపై జిల్లా అధికారులకు ఫిర్యాదు చేశారు. ఒక భూవివాదం కారణంగా తన వృద్ధులైన తల్లిదండ్రులు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారని, వారికి తక్షణమే రక్షణ కల్పించాలని ఆయన విన్నవించారు. యలమంచిలి మండలం దొడ్డిపట్లలో తమకు ఉన్న 5 సెంట్ల ఉమ్మడి స్థలం విషయంలో వివాదం నెలకొందని అనంత్ శ్రీరామ్ తన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ స్థలాన్ని కొంతమంది అక్రమంగా ఆక్రమించుకున్నారని ఆయన ఆరోపించారు. అయితే, ఈ వివాదంలో మాజీ మంత్రి చేగొండి హరిరామ జోగయ్య కుమారుడు, చేగొండి సూర్యప్రకాష్ జోక్యం చేసుకుని తన తల్లిదండ్రులను బెదిరిస్తున్నారని ఆయన ఆరోపణలు చేశారు. సదరు స్థల వివాదం ప్రస్తుతం న్యాయస్థానం పరిధిలో ఉందని, విచారణ జరుగుతుండగానే రాజకీయ పలుకుబడితో తమపై ఒత్తిడి తెస్తున్నారని అనంత్ శ్రీరామ్ ఆవేదన వ్యక్తం చేశారు. కోర్టు తీర్పు వచ్చే వరకు వేచి చూడకుండా, వృద్ధులైన నా తల్లిదండ్రులను భయభ్రాంతులకు గురిచేయడం ఎంతవరకు సమంజసం అని ఆయన ప్రశ్నించారు. చట్టంపై గౌరవంతో తాను అధికారులను ఆశ్రయించినట్లు ఆయన మీడియాకు తెలిపారు. గ్రామంలో ఉంటున్న తన తల్లిదండ్రులకు ప్రాణహాని ఉందని, రాజకీయ నాయకుల అనుచరుల నుంచి వారికి ముప్పు పొంచి ఉందని అనంత్ శ్రీరామ్ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ , ఎస్పీకి తన ఫిర్యాదు ప్రతిని అందజేశారు. నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని, వివాదాస్పద స్థలంలో యథాతథ స్థితి ని కాపాడాలని ఆయన కోరారు. అనంత్ శ్రీరామ్ ఫిర్యాదును స్వీకరించిన జిల్లా అధికారులు, ఈ అంశంపై విచారణ జరిపి నివేదిక సమర్పించాలని యలమంచిలి తహసీల్దార్ , పోలీసు అధికారులను ఆదేశించారు. చట్టపరంగా బాధితులకు న్యాయం చేస్తామని భరోసా ఇచ్చారు. అనంత్ శ్రీరామ్ , చేగొండి హరిరామ జోగయ్య కుటుంబాల మధ్య భూవివాదం ఉన్నా.. వారు సమీప బంధువులే. అనంత్ శ్రీరామ్ మాజీ మంత్రి చేగొండి హరిరామ జోగయ్యకు స్వయానా మేనల్లుడు. సొంత సోదరి కుమారుడు . అనంత్ శ్రీరామ్‌లోని సాహిత్య ప్రతిభను గుర్తించి, ఆయనను సినిమా రంగానికి పరిచయం చేయడంలో చేగొండి హరిరామ జోగయ్య కీలక పాత్ర పోషించారు. తన మేనల్లుడికి పాటల రచయితగా అవకాశాలు రావాలని జోగయ్య స్వయంగా అనేకమంది దర్శకులు, నిర్మాతల దగ్గర సిఫార్సు చేశారు. ఒకప్పుడు ఒకే గొడుగు కింద ఎదిగిన ఈ రెండు కుటుంబాల మధ్య ఇప్పుడు 5 సెంట్ల భూమి కోసం వివాదం చెలరేగడం, అది కలెక్టరేట్ మెట్లెక్కడం పశ్చిమగోదావరి జిల్లా రాజకీయ, సినీ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

### ఆయనే భూ కబ్జాదారుడు

సినీ పాటల రచయిత అనంత శ్రీరామ్ , ఆయన బంధువు చేగొండి సూర్యప్రకాష్ మధ్య మొదలైన ఆస్తి వివాదం ఇప్పుడు రాజకీయ, న్యాయపరమైన మలుపులు తిరుగుతోంది. అనంత శ్రీరామ్ తన కుటుంబానికి రక్షణ కల్పించాలని, తన తల్లిదండ్రులను సూర్యప్రకాష్ బెదిరిస్తున్నారని కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ ఆరోపణలపై సూర్యప్రకాష్ ఘాటుగా స్పందించారు. అనంత శ్రీరామ్ చేస్తున్న ఆరోపణలన్నీ పచ్చి అబద్ధాలని, తనపై కావాలనే నిరాధారమైన ఆరోపణలు చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. అనంత శ్రీరామ్ తన డబ్బు, పరపతి, రాజకీయ పలుకుబడిని ఉపయోగించి తనను వ్యక్తిగతంగా వేధిస్తున్నారని సూర్యప్రకాష్ ఆరోపించారు. తనపై కక్షపూరితంగా తప్పుడు ప్రచారం చేస్తున్నారని, ఈ క్రమంలోనే ఆయనపై పరువు నష్టం దావా వేయబోతున్నట్లు ప్రకటించారు. తన చరిత్ర నిష్కళంకమని, తనపై ఇప్పటివరకు కనీసం ఒక్క పోలీస్ కేసు కూడా లేదని ఈ సందర్భంగా సూర్యప్రకాష్ గుర్తు చేశారు. అనంత శ్రీరామ్ మాటలకు భయపడే ప్రసక్తే లేదని ఆయన స్పష్టం చేశారు. అసలు వివాదం ఆస్తికి సంబంధించిందని సూర్యప్రకాష్ వివరించారు. తన తాతయ్య చేగొండి కృష్ణమోహన్ రావుకు చెందిన ఆస్తిని అనంత శ్రీరామ్ అక్రమ మార్గాల్లో స్వాధీనం చేసుకున్నారని ఆయన సంచలన ఆరోపణ చేశారు. ఆ ఆస్తిని కాజేసేందుకే తనను అడ్డు తొలగించుకోవాలని చూస్తున్నారని, అందుకే ఇలాంటి డ్రామాలు ఆడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంత శ్రీరామ్ ఒక "పెద్ద భూ కబ్జా రాయుడు" అంటూ ఆయన తీవ్ర వ్యాఖ్యలు చేశారు. అనంత శ్రీరామ్ తల్లిదండ్రులను తాను బెదిరించినట్లు వస్తున్న వార్తల్లో వాస్తవం లేదని సూర్యప్రకాష్ తేల్చి చెప్పారు. నేను వారిని బెదిరించినట్లు కనీసం ఒక్క ఆధారమైనా నిరూపిస్తే దేనికైనా సిద్ధం అని ఆయన సవాల్ విసిరారు. లేనిపోని ఫిర్యాదులతో అధికారులను తప్పుదోవ పట్టించడం మానుకోవాలని హితవు పలికారు. కేవలం తన స్వార్థం కోసం వృద్ధులైన తల్లిదండ్రులను ఈ వివాదంలోకి లాగడం సరికాదని ఆయన విమర్శించారు. ఒకవైపు అనంత శ్రీరామ్ తన తల్లిదండ్రులకు ప్రాణాలకు ముప్పు ఉందని కలెక్టర్‌కు ఫిర్యాదు చేయగా, మరోవైపు సూర్యప్రకాష్ భూ కబ్జా ఆరోపణలు చేస్తూ కోర్టుకు వెళ్తామనడం చర్చనీయాంశమైంది.

Cinema




రెబల్ స్టార్ ప్రభాస్, హను రాఘవపూడి కాంబోలో రూపుదిద్దుకుంటోన్న 'ఫౌజీచిత్రంలో సీనియర్ నటి జయప్రద ఓ కీలక పాత్ర చేస్తున్న విషయం తెలిసిందే. తాజాగా ఆమె 'ఫౌజీ' గురించి చెప్పిన వ్యాఖ్యలు అభిమానుల్లో, సినీ ప్రియుల్లో.. సినిమాపై భారీ అంచనాలు ఏర్పడేలా చేస్తున్నాయి. ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్‌లో భాగమైనందుకు అదృష్టంగా భావిస్తున్నానని, ప్రభాస్‌తో కలిసి ఇంతటి అద్భుతమైన సినిమాలో నటించడం ఎంతో గర్వంగా ఉందని ఆమె పేర్కొన్నారు. జయప్రద చెప్పిన ఈ మాటలు సినిమాపై క్యూరియాసిటీని మరింత పెంచడమే కాకుండా, వెండితెరపై ఈ చిత్రం ఎలాంటి వండర్స్ క్రియేట్ చేయబోతుందోననే ఆసక్తిని అందరిలోనూ రేకెత్తిస్తున్నాయి. భారతీయ చలనచిత్ర రంగంలో ఉన్న సీనియర్ నటీమణులలో జయప్రద ఒకరు. అలాంటి లెజెండరీ నటి 'ఫౌజీ' చిత్రం గురించి, ప్రభాస్ గురించి అంత పాజిటివ్‌గా మాట్లాడటం అభిమానులకు ఎంతో స్పెషల్ మూమెంట్‌గా నిలుస్తోంది. ఈ సినిమాను ఒక బ్యూటిఫుల్ ప్రాజెక్ట్‌గా అభివర్ణించిన ఆమె, ఇందులో భాగమవడంపై తన సంతోషాన్ని వ్యక్తం చేశారు. ప్రభాస్ పట్ల, చిత్రయూనిట్ పట్ల ఆమె చూపించిన అభిమానం, ప్రశంసలు ప్రస్తుతం సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతున్నాయి. ఈ వ్యాఖ్యలను బట్టి సీనియర్ నటీనటులకు ప్రభాస్ పై ఎంతటి గౌరవం, అభిమానం ఉన్నాయో అర్థమవుతోంది. మరోవైపు ప్రభాస్‌తో పాటు, ఆయన అభిమానులు మంచి హిట్ కోసం ఎంతగానో వేచి చూస్తున్నారు. ఈ సంక్రాంతికి వచ్చిన 'ది రాజా సాబ్' చిత్రం ఊహించని ఫలితాన్ని చవిచూసింది. ఈ సినిమా పెద్ద హిట్ అవుతుందని ఆశించిన అభిమానులు తీవ్ర నిరాశకు లోనయ్యారు. ప్రభాస్ మాత్రం ఈ సినిమా రిజల్ట్‌ని పట్టించుకోకుండా.. తన తదుపరి సినిమాల షూటింగ్‌తో బిజీగా ఉన్నారు. ఇప్పుడాయన చేస్తున్న సినిమాలన్నీ భారీ పాన్ ఇండియా సినిమాలే. అందులో 'పౌజీ' చిత్రం ప్రభాస్‌కు, అభిమానులకు కూడా చాలా ప్రత్యేకమైనదని చెప్పుకోవచ్చు. హను రాఘవపూడి వంటి క్లాస్ డైరెక్టర్ నుంచి వస్తోన్న ఈ సినిమాలో భారీ తారాగణం నటిస్తోన్న విషయం తెలిసిందే.




ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా నుంచి సోషల్ మీడియా వరకు ప్రమోషన్స్ వచ్చేశాయి.. అయినా సరే.. ప్రమోషన్స్ ఎంత వరకు, ఎవరికి రీచ్ అవుతున్నాయనేది అర్థం కావడం లేదంటూ.. దర్శకనిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. సంధ్య తిరువీధుల నిర్మాణంలో తీర్థ క్రియేషన్స్ బ్యానర్‌పై పార్థసారధి కొమ్మోజు దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'సందిగ్ధం' . నిహాల్, ప్రియా దేశ్ పాగ్, అర్జున్ సిహెచ్, కాజల్ తివారి హీరోహీరోయిన్లుగా నటించగా.. 'తెర చేప' ఫేమ్ నవీన్ సంకరపు విలన్ పాత్ర పోషించారు. మే 29న రిలీజ్‌కు సిద్ధమైన ఈ చిత్ర ప్రీ రిలీజ్ వేడుక ను తాజాగా హైదరాబాద్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తమ్మారెడ్డి భరద్వాజ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా తమ్మారెడ్డి భరద్వాజ్ మాట్లాడుతూ.. ఈ మధ్యకాలంలో టైటిల్స్ ఎలా పడితే అలా పెడుతున్నారు. 'సందిగ్ధం' అనే టైటిల్ చాలా బాగుంది. అచ్చమైన తెలుగులో టైటిల్ పెట్టినందుకు చాలా సంతోషంగా ఉంది. అడవుల్లో ఎంతో కష్టపడి మూవీని చేశారని టీజర్, ట్రైలర్ చూస్తుంటే తెలుస్తోంది. ప్రస్తుతం సినిమా ప్రమోషన్స్ విషయంలో పద్ధతి అంతా మారిపోయింది. ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా నుంచి సోషల్ మీడియా వరకు చేరింది. అసలు చేసే ప్రమోషన్ ఎవరి వరకు రీచ్ అవుతోందనేది కూడా తెలీడం లేదు. నాలాంటి వాడికి ఇన్‌స్టాగ్రామ్ ఉండదు. మరి నాకు ఎలా తెలుస్తుంది. ఇలాంటి చిన్న సినిమాలను అందరూ ముందుండి ప్రమోట్ చేయాల్సిన అవసరం ఉంది. సినిమా ఆడుతుందా? లేదా? అనేది తర్వాత విషయం. అసలు మూవీ ఒకటి వస్తుందనే విషయం అందరికీ తెలియాలి కదా. అందరూ ఈ సినిమాను వీలైనంతగా ప్రమోట్ చేయాలని, 'సందిగ్ధం' మంచి విజయం సాధించాలని కోరుకుంటున్నానని అన్నారు.

చిత్ర దర్శకుడు పార్థసారథి మాట్లాడుతూ.. మా సినిమాకు మీడియా చేస్తున్న సపోర్ట్‌ను మరిచిపోలేము. మా కోసం ఇక్కడకు వచ్చిన తమ్మారెడ్డికి ధన్యవాదాలు. ఈ ప్రయాణంలో నిర్మాత, నా భార్య సంధ్య ఎంతో సహకరించింది. ఈ సినిమాకు పనిచేసిన నటీనటులు, సాంకేతిక నిపుణులందరికీ థ్యాంక్స్. అందరూ ఎంతగానో సహకరించారు. 'సందిగ్ధం'తో మేం ఆశించిన విజయం దక్కుతుందని నమ్ముతున్నాం. చిన్న సినిమాల్ని తీయడం కంటే ప్రమోట్ చేయడం, విడుదల చేయడం చాలా కష్టం. మే 29న వస్తున్న మా సినిమాకు ఆడియెన్స్ నుంచి సపోర్ట్ లభిస్తుందని ఆశిస్తున్నానని తెలిపారు. ఇంకా ఈ కార్యక్రమంలో చిత్రబృందం మాట్లాడుతూ.. సినిమాను సక్సెస్ చేయాలని ప్రేక్షకులను, సపోర్ట్ చేయాలని మీడియాను కోరారు.




సినిమా పరిశ్రమలో సమస్యల గురించి పదే పదే జరుగుతున్న చర్చలపై దర్శక నిర్మాత మధుర శ్రీధర్ రెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. సినిమా ఒక అద్భుతమైన మీడియం అని, దాన్ని బాధల వేదికగా మార్చకూడదని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రస్తుతం పలువురు సినీ ప్రముఖులు ప్రతి వేదికపై ఇండస్ట్రీలో ఇబ్బందులు, ఒత్తిడులు, నష్టాల గురించి మాట్లాడుతుండటంపై ఆయన సోషల్ మీడియా ద్వారా స్పందించారు. "ఏ వ్యాపారంలో అయినా రిస్కులు, ఒత్తిడులు, లాభనష్టాలు సహజమే. వాటిని అర్థం చేసుకుని ఆ రంగంలోకి వస్తారు. సినిమా ఇండస్ట్రీ కూడా అందుకు మినహాయింపు కాదు" అని మధుర శ్రీధర్ రెడ్డి పేర్కొన్నారు. పరిస్థితులు అనుకూలంగా లేవనిపిస్తే సినిమాలు తీయకుండా వేరే వ్యాపారాలు చేసుకోవచ్చని, కానీ ప్రతిసారి మైక్ ముందుకు వచ్చి ఇండస్ట్రీ పరిస్థితులపై బాధలు చెప్పుకోవడం వల్ల పరిశ్రమ ప్రతిష్ట దెబ్బతింటుందని అన్నారు. సినిమా అనేది ఒక బిజినెస్ మాత్రమే గానీ ఛారిటీ కాదని ఆయన స్పష్టం చేశారు. "ఒక సినిమా నష్టపోతే దాన్ని తట్టుకుని మరో ప్రయత్నం చేసే ధైర్యం ఉండాలి. లేదంటే ఆగిపోవాలి. వ్యక్తిగత సమస్యలను, కంపెనీ ఇబ్బందులను సినిమా మీద రుద్దకండి" అని సూచించారు. మంచి సినిమాలకు ప్రేక్షకుల ఆదరణ ఎప్పటికీ ఉంటుందని మధుర శ్రీధర్ రెడ్డి నమ్మకం వ్యక్తం చేశారు. "సిన్సియర్‌గా సినిమాలు తీస్తే ప్రతి మంచి చిత్రానికి ప్రేక్షకుల హృదయాల్లో ప్రత్యేక స్థానం ఉంటుంది" అంటూ ఆయన చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు సోషల్ మీడియాలో బాగా వైరల్ అవుతున్నాయి.







OWNED, PRINTED AND PUBLISHED BY KARNAM BHASKAR RAO, PRINTED AT SHREYA SREE PRINTERS, H.NO.1-3-129, RAJENDRA NAGAR, MAHABUBNAGAR DIST., T.S. PUBLISHED AT SREEJA SREE PUBLICATONS, H.NO.1-3-129, RAJENDRA NAGAR, MAHABUBNAGAR DIST, T.S, RNI NO: APTEL/2012/47246 EDITOR : KARNAM BHASKAR RAO, Ph: 08542-222814, Cell: 9848997085